తీన్మార్
తెలుగు దినపత్రిక

## మన దౌత్యనీతికి ప్రాతిపదిక ఏమిటి?

'ప్రపంచంలో అతి పెద్ద దౌత్యవేత్తలు శ్రీకృష్ణుడు, హనుమంతుడు' అని విదేశాంగ మంత్రి ఎస్. జై శంకర్ ఇటీవల ముంబైలో తన పుస్తకావిష్కరణ సందర్భంగా వ్యాఖ్యానించారు. 'హనుమంతుడు దౌత్యనీతికి మించి వ్యవహరించి శ్రీలంకకు నిప్పు పెట్టి వచ్చాడుబీ శ్రీకృష్ణుడు అందుకు భిన్నంగా ఓపికగా వ్యవహరించి శిశుపాలుడు వంద తప్పులు చేసే వరకూ వేచి చూసి ఆ తర్వాత తల నరికి చంపాడు' అని జైశంకర్ అన్నారు. జరాసంధుడు, ద్రోణుడు తదితరులను వధించేందుకు శ్రీకృష్ణుడు అనుసరించిన 'వ్యూహాత్మక వంచనల' గురించి కూడా ఆయన వివరించారు. ఇతిహాసాలు, చరిత్ర పుటలలోని అనేక సంఘటనలు మన నిత్య జీవితంలో కూడా కనపడతాయి. ప్రహ్లాదుడు లాంటి సచ్ఛీలుడు కూడా కొన్ని సందర్భాల్లో అబద్ధాలు మాట్లాడవచ్చునని చెప్పాడు. వర్తమానంలోనూ రావణుడు, దుర్యోధనుడు లాంటి పాత్రలు మనకు తారసపడతాయి. మన జీవితాలకు సమీపంగా ఉన్నందువల్లే మహాభారతం లాంటి ఇతిహాసాలు ఇప్పటికీ కాలగర్భంలో కలిసిపోకుండా నిలిచిపోయాయి. నిజానికి భారతదేశంలో చాలా మంది మేధావులు, తాము చేస్తున్న వాదనలను సమర్థించుకోవడానికి విదేశీ పండితుల ఉవాచల్ని ఎక్కువగా ఉటంకిస్తుంటారు. ఇవి మితిమీరినప్పుడు భారతదేశంలో మేధావులు లేరా, లేక భారతదేశం ఒక అపరిణత మార్గంలో ఉన్నదా అన్న అనుమానాలు కలుగుతాయి. ఇతిహాసాలు, ప్రాచీన సాహిత్య, సంస్కృతులకు చెందిన వారిని అటుంచినప్పటికీ ఆధునిక కాలంలో మేధావులుగా పరిగణన పొందిన వివేకానందుడు, అంబేడ్కర్, మహాత్మాగాంధీ, నెహ్రూ, రాజాజీ, ఎంఎన్ రాయ్, తరిమెల నాగిరెడ్డి లాంటి వారిని కూడా ఉటంకించడం అరుదుగా కనపడుతుంది. వీరందరూ ఒకే భావజాలం కలవారు కాకపోవచ్చు కాని సమాజంలో మార్పుల విషయంలో ప్రత్యామ్నాయం గురించి యోచించినవారు. అయితే పౌరాణిక, ఐతిహాసిక ఉదాహరణలతో ఆధునిక సమాజంలో జరుగుతున్న పరిణామాల గురించి వివరించడం సరైనదేనా? ఆలోచించాల్సిన విషయమిది. కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విపరీత పరిణామం బాగా కనపడుతోంది. ప్రతిదానికీ పొంతన ఉన్నా, లేకపోయినా ఒక సంస్కృత వాక్యం ఉటంకించడం, పురాణ పురుషుల చర్యల్ని ఉదహరించడం పరిపాటి అయిపోయింది. నేటి కాలంతో పొసగని అభూతకల్పనలు, అద్భుతాలతో ప్రస్తుత చర్యల్ని సమర్థించుకోవడం ఎల్లెడలా కనిపిస్తోంది. వాట్సాప్ యూనివర్సిటీల్లో ఇలాంటి గత కాల యాత్రికులు అధికంగా కనిపిస్తున్నారు. సంఘ్ పరివార్ పెద్దల దృష్టిని ఆకర్షించడానికి, తమ పదవులు కాపాడుకోవడానికి పౌరాణిక విశేషాలు ఉటంకించే వారు కూడా లేకపోలేదు. అయితే ఇలాంటి ఉదాహరణలు జైశంకర్ లాంటి వారు ఇస్తున్నారంటే అది మనుగడ కోసమా, లేక చిత్తశుద్ధితో మాట్లాడుతున్నారా అని యోచించాల్సి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో మనం శ్రీకృష్ణుడిలా వ్యవహరిస్తున్నామా, లేక హనుమంతుడిలా ప్రవర్తిస్తున్నామా అనేది జైశంకర్ చెప్పగలరా? మనం ఏం చేయకపోయినా సమర్థించుకోవడానికి పురాణాల్లో, ఇతిహాసాల్లో ఏదో ఘట్టం ఉండనే ఉంటుంది సుమా! ప్రపంచ దేశాలతో ఏ దేశ సంబంధాలు అయినా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉంటాయి. కాలం తెచ్చిన, తెస్తోన్న మార్పులే ఆ సంబంధాలకు ప్రాతిపదికగా ఉంటాయి. సమయం మనది కానప్పుడు వ్యూహాత్మక మౌనం పాటించాల్సిన అవసరం కూడా ఏర్పడుతుంది. భారతదేశం చాలా చిన్న దేశమని, చైనా వంటి పెద్ద దేశంతో యుద్ధం చేయలేమని జైశంకర్ ఆ మధ్య ఏ వ్యూహం ప్రకారం ప్రకటించారు? భారత-చైనా సత్సంబంధాలు మెరుగుపడినప్పుడే ఈ శతాబ్దం ఆసియాది అవుతుందని కూడా ఆయన అంతకు ముందు ప్రకటించారు. అత్యంత కీలకమైన జీ-20 దేశాల సమావేశాలు మన అధ్యక్షతన దేశంలో వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న సమయంలో భారతదేశం ఏ సందేశం ఇస్తున్నదన్న విషయమై ప్రపంచం చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్నది. ఒకవైపు జీ%--%20 సమావేశాలు జరుగుతుండగా అత్యంత కీలకమైన షాంఘై కోపరేషన్ ఆర్గనేజేషన్ తొలి మంత్రిత్వ స్థాయి సమావేశం కూడా వచ్చే వారం ఢిల్లీలో జరుగనున్నది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో జీ- 20, వచ్చేఏడాది ఎస్‌సిఓ శిఖరాగ్ర సమావేశాలు భారతదేశంలోనే జరుగనున్న రీత్యా ప్రపంచ రాజకీయాల్లో భారతదేశం ఎలాంటి పాత్ర పోషిస్తుందన్న విషయం స్పష్టం కానున్నది. ఈ రెండు సమావేశాల్లోనూ రష్యా, చైనాల పాత్ర అత్యంత కీలకం. ఈ సమావేశాలకు చైనా రాకపోతే ఎన్నో సమస్యలు అపరిష్కృతంగా మిగిలిపోవడమే కాక చైనాపై ఆర్థికంగా ఆధారపడిన అనేక దేశాలు కూడా గైర్హాజరయ్యే ప్రమాదం ఉన్నది. ఎంత మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ గురించి మాట్లాడుతున్నప్పటికీ, ఇప్పటికీ విదేశీ వాణిజ్యంలో మనం చైనాపై ఆధారపడి ఉన్నాం. గత ఐదేళ్లలో చైనా నుంచి మన దిగుమతులు 29 శాతం పెరిగాయని మన వాణిజ్య మంత్రే గత ఏడాది లోక్ సభలో ప్రకటించారు. ఈ సమావేశాల్లో భారత్‌ను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి చైనా, రష్యాలు కూడా ప్రయత్నిస్తున్నాయి. సరిహద్దు వివాదాల రీత్యా భారత్, చైనాల మధ్య సంక్లిష్టమైన సంబంధాలు నెలకొనివున్నాయి. జీ%--%20, ఎస్‌సిఓ శిఖరాగ్ర సమావేశాల మూలంగా కొద్దికాలం ఈ వివాదాలను ప్రక్కన పెట్టేందుకు ఉభయదేశాలు ప్రయత్నిస్తున్నాయి. అందుకే బాలిలో జరిగిన శిఖరాగ్ర సమావేశానికి మోదీ వెళ్లి చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో కరచాలనం చేశారు. జైశంకర్ తాజా ప్రకటనలను కూడా ఈ నేపథ్యంలోనే చూడవలసి ఉంటుంది. అయితే ఇండోనేషియా వంటి చిన్నదేశం జీ-20కి నాయకత్వం వహించడానికీ, మనం నాయకత్వ వహించడానికి ఎంతో తేడా ఉన్నది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇప్పటి వరకూ ఇంచుమించు 75 దేశాల్లో పర్యటించారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో తానే చక్రం తిప్పుతునట్లుగా వ్యవహరించారు. భారతదేశం విశ్వగురు స్థానం పొందుతున్నట్లు మనం చెప్పుకున్నాం. అయితే, ఇటీవల జరిగిన జీ%--%20 దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలోనే కాదు, ఆర్థిక మంత్రుల, సెంట్రల్ బ్యాంకు గవర్నర్ల సమావేశాలు కూడా సంయుక్త ప్రకటనను విడుదల చేయడంలో విఫలమయ్యాయి. అన్ని చోట్లా ఉక్రెయిన్ యుద్ధమే అడ్డువచ్చింది. అమెరికాతో పాటు పశ్చిమ దేశాల ఒత్తిడి వల్ల చర్చలు ముందుకు సాగలేదని రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లవ్రోవ్ ప్రకటించారు. ఇక అగ్రదేశాధినేతలు హాజరయ్యే సెప్టెంబర్‌లో జీ-20 శిఖరాగ్ర సమావేశాల నాటికి భారత్ ఏదైనా మార్పు తీసుకువస్తుందో లేదో వేచి చూడాల్సి ఉన్నది. విద్యాధికుడైన జై శంకర్ విద్యార్థి దశలో స్వేచ్ఛా ఆలోచనాపరుల గ్రూపులో ఉన్నవారు.

# తెలంగాణ వాసికి ప్రతిష్టాత్మక పురస్కారం

### - బెస్ట్ సిటిజన్ ఆఫ్ ఇండియా డాక్టర్ మునీర్ అహ్మద్ షరీఫ్

మిర్యాలగూడ, సెప్టెంబర్ 09(తీన్మార్ న్యూస్): మిర్యాలగూడ పట్టణానికి చెందిన డాక్టర్ మునీర్ అహ్మద్ షరీఫ్ ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపికయ్యారు. జనయేత్రి ఫౌండేషన్ స్థాపించి పొరుగు రాష్ట్రాల్లోనూ తన సేవలను విస్తరించిన అనతి కాలంలోనే ఆయన ఈ పురస్కారానికి ఎంపిక కావడం గమనార్హం మానవ హక్కుల సాధనలో అవిరామంగా కృషి చేయడంతో పాటు సమాజ అభ్యున్నతి కోసం నిస్వార్థ సేవలను నిర్వర్తిస్తున్న డాక్టర్ మునీర్ అహ్మద్ షరీఫ్ ను గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ పురస్కారానికి ఎంపిక చేసినట్టు కార్యక్రమ నిర్వాహకులు, పీపుల్ ఫోరం ఆఫ్ ఇండియా భారత్ సేవా సమాజ్ వారు పేర్కొన్నారు. శనివారం తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నై లో మైలాపోర్ లోని భారతీయ విద్యా భవన్ ఆడిటోరియంలో నిర్వహించిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ కాన్వొకేషన్ కార్యక్రమంలో వర్సిటీ వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ పి.మాన్యుయేల్, ఇతర అతిథుల చేతుల మీదుగా డాక్టర్ మునీర్ అహ్మద్ షరీఫ్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మునీర్ అహ్మద్




షరీఫ్ ను డాక్టర్ పి.మాన్యుయేల్ శాలువాతో ఘనంగా సత్కరించి పురస్కారంతో పాటు పతకం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజ సేవలో డాక్టర్ మునీర్ అహ్మద్ షరీఫ్ అభినందనీయుడని కొనియాడారు. ఓ వైపు వైద్య వృత్తిలో తన వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తూనే తన సమయంలో సింహభాగం సామాజిక సేవా కార్యక్రమాల కోసం సద్వినియోగం చేస్తున్న డాక్టర్ మునీర్ అహ్మద్ షరీఫ్ వంటి సోషల్ వర్కర్స్ సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. నిస్వార్థ సేవలకు నిలువెత్తు నిదర్శనంగా ఆయన సేవలు కొనసాగుతున్నాయని కొనియాడారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజాసేవే తన అభిమతంగా ఎంచుకొని ఎందరో నిరుపేదలకు తన శక్తివంచన మేరకు డాక్టర్ మునీర్ అహ్మద్ షరీఫ్ సేవలందించారని అన్నారు. ఆపదలో ఉన్న రోగులకు రక్తదానం చేయడం కోసం రక్తదాతల ప్రత్యేక వాట్సాప్ గ్రూపు నిర్వహించడం ఆయన సామాజిక సేవా సుగుణానికి అద్దం పడుతున్నదని అభివర్ణించారు. అన్ని కాలాల్లో ఆయన సేవలు నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయంటే ఆయనకు అల్లా దీవెనలు మెండుగా ఉన్నాయని అర్థమని అన్నారు.

మండుటెండల్లో బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం, ఎముకలు కొరికే చలిలో నిర్భాగ్యులకు దుప్పట్లు పంపిణీ, వానాకాలంలో కడు పేదలకు, యాచకులకు ఆహారం పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలను తన మదిలో చిరకాలం నిలిచిపోతాయని అన్నారు. అదేవిధంగా, డాక్టర్ మునీర్ అహ్మద్ షరీఫ్ వెన్నంటే ఉండి సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వామ్యమవుతున్న జనయేత్రి ఫౌండేషన్ సభ్యులందరికీ తన అభినందనలు తెలియజేస్తున్నట్టు డాక్టర్ పి.మాన్యుయేల్ పేర్కొన్నారు. కాగా, తన సేవలను గుర్తించి బెస్ట్ సిటిజన్ ఆఫ్ ఇండియా పురస్కారానికి తెలంగాణ రాష్ట్రం నుంచి తనను ఎంపిక చేసిన సెనేట్,



అడ్వయిజరీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు జనయేత్రి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మునీర్ అహ్మద్ షరీఫ్ తెలిపారు. ఈ అవార్డు స్వీకరణ అనంతరం తన బాధ్యత మరింత పెరిగిందని భావిస్తున్నట్టు ఆయన తెలిపారు. నిండు నూతనోత్సాహంతో ఇంకా బాగా కష్టపడి సమాజ అభ్యున్నతి కోసం పాటుపడతానని అన్నారు. గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ నుంచి పురస్కారం తనకు దక్కడం ఎంతో గర్వంగా, ఆనందంగా ఉన్నదని డాక్టర్ మునీర్ అహ్మద్ షరీఫ్ తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తి (రిటైర్డ్), గ్లోబల్ పీస్ హ్యూమన్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కె.వెంకటేశన్, మాజీ స్పెషల్ కమిషనర్, తమిళనాడు ప్రిన్సిపల్ సెక్రెటరీ సంపత్ కుమార్, ఐజీపీ (రిటైర్డ్- సీఆర్పీఎఫ్ ) డాక్టర్ టి.శేఖర్, డాక్టర్ రంగనాథన్, ఆల్ ఇండియా హజ్ కమిటీ( తమిళనాడు) వీసీ ఎస్.మునవారి బేగం, తదితరులు పాల్గొన్నారు.

## ఎంబిబిఎస్ సీట్ సాధించిన విద్యార్థిని కళ్లెం పావని

### - అభినందించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుదగాని హరిశంకర్ గౌడ్

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 09(తీన్మార్ న్యూస్): యాదగిరిగుట్ట మండలంలోని చోల్లేరు గ్రామానికి చెందిన కళ్లెం కల్పనా - వెంకటేశ్ కుమార్తె కళ్లెం పావని ఇటీవల నీట్ ఎగ్జామ్ లో మంచిర్యాంకు తెచ్చుకొని సంగారెడ్డి లోని జిఎస్జిఆర్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు సాధించింది.

ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుదగాని హరిశంకర్ గౌడ్ కళ్లెం పావని ని శాలువాతో సత్కరించి అభినందించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ

పావని ఎంబిబిఎస్ పూర్తి అయ్యేవరకు తాను అన్ని విధాల అండగా ఉంటానాని, నా వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తానాని అన్నారు. ఈ కార్యక్రమంలో మూటకొండూర్ మండల బిజెపి అధ్యక్షులు జొరుక ఎల్లేష్ ముదిరాజ్, మండల ఉపాధ్యక్షులు దండు ఉపేందర్,



మూటకూండూర్ మండల కార్యదర్శి యెల్లంల శ్రీధర్ రెడ్డి, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు అనంతుల పాండురంగా రెడ్డి, భువనగిరి పార్లమెంట్ సోషల్ మీడియా కో కన్వీనర్ సుదగాని ఉదయ్ కిరణ్ గౌడ్,

మండల నాయకులు పల్లా జితేందర్ రెడ్డి, వర్టూర్ బూత్ అధ్యక్షులు పల్లె నరేశ్, చందేపల్లి బూత్ అధ్యక్షులు మార్క రాజు గౌడ్, గుండ్లపల్లి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## మక్తల్ అరెస్టులు అప్రజాస్వామికం




మక్తల్, సెప్టెంబరు 09(తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమనీ ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీహరి అన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు సందర్శనకు వెళ్తున్నారని ముందస్తు సమాచారంతో మక్తల్ పోలీసులకు ఆయనను హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్తి కాని ప్రాజెక్టులను ప్రారంభిస్తూ ప్రజలను, సీఎం కేసీఆర్ మోసం చేస్తున్నారని అన్నారు. లబ్ధి కొరకే ప్రారంభోత్సవాలన్నారు.

## మంచాల మండలంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి పర్యటన



ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 09 (తీన్మార్ న్యూస్): రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం నియజకవర్గం,మంచాల మండలంలోని లింగంపల్లి, మంచాల,

జాపాల ఆరుట్ల, పటేల్ చెరువు తాండ, చిత్తాపూర్, తాళ్లపల్లిగూడ గ్రామాలలో ఇబ్రహీంపట్నం అభివృద్ధి ప్రధాత ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి పర్యటించి రూ. 12.48 కోట్ల రూపాయల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామల సర్పంచ్ లు, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పాము కాటుతో పాడి గేదె మృతి



ఆలేరు, సెప్టెంబర్ 09(తీన్మార్ న్యూస్): పాముకాటుతో పాడి గేదె మృతి చెందిన సంఘటన శనివారం ఆలేరు మండలంలోని కొలనుపాకలో చోటుచేసుకుంది. బాధిత రైతు పైసా రామనాథం తెలిపిన వివరాల ప్రకారం తమ బావి దగ్గర పాడి గేదె శనివారం పాము కాటుకు గురై మృతి చెందిందని బాధిత రైతు తెలిపారు. పాడి గేదె మృతితో రైతు కుటుంబ సభ్యులు పాడి గేద వద్ద కన్నీటి పార్యంతమయ్యారు. పాడి గేదె విలువ సుమారు రూ.80000/- ఉంటుందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

## పైరవీలకు తావు లేకుండా సంక్షేమ పథకాలు

### - ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

ఆలేరు, సెప్టెంబర్ 09(తీన్మార్ న్యూస్): పైరవీలకు తావు లేకుండా తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం ఆలేరు పట్టణ కేంద్రంలోని దొంతిరి సోమిరెడ్డి గార్డెన్లో ఆలేరు నియోజకవర్గ వ్యాప్తంగా రైతు రుణమాఫీ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 108 సొసైటీల ద్వారా 30 వేల మందికి సుమారు 146 కోట్ల రుణమాఫీ జరిగిందన్నారు. ఆలేరులో నాలుగు వేల 54 మందికి గాను 16 కోట్ల రుణమాఫీ జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఆలేరు పిఏసిఎస్ చైర్మన్ మొగుల గాని మల్లేష్ గౌడ్, మదర్ డైరీ చైర్మన్ శ్రీకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మోత్కుపల్లి జ్యోతి, పిఏసిఎస్



డైరెక్టర్లు ఆరె మల్లేష్ గౌడ్, బీసు కృష్ణంరాజు గౌడ్, బిక్షపతి, రాజపేట ఎంపీపీ గోపగాని బాలమణి యాదగిరి గౌడ్, వివిధ మండలాల పిఏసిఎస్ చైర్మన్లు, సర్పంచులు, ఎంపిటిసిలు, అధిక సంఖ్యలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## డిసిసిబి చైర్మన్ కు సత్కారం



ఆలేరు, సెప్టెంబర్ 09(తీన్మార్ న్యూస్):!ఆలేరు మండలంలోని రాఘవపురం కురుమ సంఘం భవన నిర్మాణానికి రూపాయలు ఐదు లక్షల మంజూరు చేయించినందుకు కృతజ్ఞతగా గ్రామ కురుమ సంఘం ఆధ్వర్యంలో శనివారం డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.

భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేనున్నట్లు మహేందర్ రెడ్డి తెలిపారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ బక్క రాంప్రసాద్, టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు కరికె మల్లేష్, టిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు పరిధి సంతోష్, కురుమ సంఘం నాయకులు బండ శ్రీశైలం, బండ అయిలయ్య, పరిద బాలయ్య, తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అధికారం కి రావడం మహిళాలదే కీలక పాత్ర

### - అబ్జర్వర్ శాంతా ఫిలిఫ్ నీలం పద్మ




ఆలేరు, సెప్టెంబర్ 09(తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకురావడం మహిళలు కీలకపాత్ర పోషించాలని భువనగిరి పార్లమెంట్ అబ్జర్వర్ శాంతా ఫిలిఫ్ జిల్లా అధ్యక్షురాలు నీలం పిలుపునిచ్చారు.

శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు మండల కేంద్రంలో కాంగ్రెస్ భవనంలో జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ అధ్యక్షతన భువనగిరి కోఆర్డినేటర్ పావని, బ్లాక్ మండల పట్టణ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు.

సమావేశంలో రానున్న ఎన్నికలకు సంబంధించి ప్రచార కార్యక్రమాలు మహిళా కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం నియోజకవర్గం మండల కోఆర్డినేట్లు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ప్రతి గ్రామంలో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ డిక్లరేషన్ పై విస్తృత ప్రచార నిర్వహించాలని అన్నారు.

అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి ఎండగట్టాలని సూచించారు మహిళలు ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సబ్బండ వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజ మార్గం

**- ఇరు వర్గాలు మాట్లాడి రాజీపడి కేసులు పరిష్కరించుకోవాలి**
**- నేషనల్ లోక్ అదాలత్ కార్యక్రమంలో పిలుపు**




భువనగిరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 09(తీన్మార్ న్యూస్): రాజీ మార్గమే రాజమార్గమని లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కరించుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ ప్రదీప్ పిలుపునిచ్చారు. భువనగిరి జిల్లాలోని రామన్నపేట మండల కేంద్రంలో గల కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నేషనల్ లోక్ అదాలత్ కార్యక్రమంలో కేసుల పరిష్కారంలో రాజీమార్గమే రాజమార్గమని తగాధపడడం ద్వారా కోర్టుల చుట్టు తిరిగి టైం వేస్ట్ చేసుకోకుండా లోకాదాలత్లో కేసులను రాజీ చేసుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ ప్రదీప్, ఎస్.చందన, పిలుపునిచ్చారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జరిగిన లోక్ అదళలత్ ప్రోగ్రాంలో వారు పాల్గొని మాట్లాడుతూ రాజీ



చేసుకోవడం ద్వారా ఇద్దరూ గెలుస్తారని కేసులకు తిరగడం ద్వారా ఒకరు గెలుస్తారని కావున రాజీ చేసుకోవడమే రాజమార్గం అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కంపాటి యాదగిరి, ప్రభాకర్, పిపి అవినాష్, రామన్నపేట, మోత్కూరు, అడ్డగూడూరు, ఎస్సైలు, న్యాయవాదులు దినేష్, స్వామి, శ్రవణ్ కుమార్, సూపరిండెంట్ గంగాభవాని, బాలగోని శివరాజు, సిబ్బంది మరియు పోలీసులు తదితరులు పాల్గొన్నారు.




# తగ్గిన దిగుబడి.. దక్కని మద్దతు



జనగామ:ఓ వైపు తగ్గిన దిగుబడి, మరో వైపు దక్కని మద్దతు ధర రైతులకు యాసంగి సీజన్లో నష్టాలనే మిగులుస్తున్నాయి. జనగామ జిల్లాలో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నా.. వడ్ల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు మాత్రం ఇంకా స్పీడ్ అందుకోలేదు. ఆఫీసర్లు రివ్యూలు నిర్వహించడంలో చూపుతున్న వేగం సెంటర్లను ఓపెన్ చేయడంలో చూపడం లేదు. దీంతో రైతులు ప్రైవేట్ వ్యక్తులను వ్యక్తులను ఆశ్రయించే పరిస్థితి ఏర్పడింది. మరో వైపు మార్కెట్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో సైతం రైతులకు మద్దతు ధర దక్కడం లేదు. జనగామ అగ్రికల్చర్ మార్కెట్కు ప్రతి రోజు 4 వేల నుంచి 5 వేల బస్తాల వడ్లు వస్తున్నాయి.జనగామ మార్కెట్కు 3,243 బస్తాల వడ్లు వచ్చాయి. మద్దతు ధర రూ. 2,060 ఉండగా రైతులకు గరిష్టంగా రూ. 1,625, కనిష్టంగా రూ. 1,503 మాత్రమే దక్కింది. యాసంగి సీజన్ పైభారీగా ఆశలు పెట్టుకున్న రైతులు మొత్తం 1.89 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. దీంతో ఈ సారి 2.30 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కానీ దేవాదుల నీళ్లు ఇన్టైంలో విడుదల చేయకపోవడం, భూగర్భ జలాలు సైతం అడుగంటడంతో పంట దెబ్బతింది. ముందస్తుగా నాట్లు వేసిన పంటలకు తెగుళ్లు సోకాయి. పంట పొట్ట దశలో ఉన్నప్పుడు మెడ విరుపు తెగులు సోకడంతో గొలుసులు పాలు పట్టకుండా ఊస తిరిగిపోయాయి. దీంతో దిగుబడిపై భారీగా ఎఫెక్ట్ పడింది. ఎకరానికి 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ఈ సీజన్లో 20 క్వింటాళ్లు కూడా సరిగా రాలేదని రైతులు అంటున్నారు. ఎకరానికి రూ. 20 వేల నుంచి రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టామని, దిగుబడి తగ్గడం, మద్దతు ధర దక్కకపోవడంతో నష్టాలు తప్పేలా లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనగామ జిల్లాలో వడ్ల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు లో ఆలస్యం జరుగుతోంది. కోతలు ముమ్మరంగా జరుగుతుంటే.. ఆఫీసర్లు ఇంకా కేంద్రాల ఏర్పాటు సన్నాహాలపైనే ఫోకస్ పెడుతున్నారు. ఈ సీజన్లో జిల్లా వ్యాప్తంగా ఐకేపీ ఆధ్వర్యంలో 111, పీఏసీఎస్ల ఆధ్వర్యంలో 89 కలిపి మొత్తం 200 సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సెంటర్లను వెంటనే ఏర్పాటు చేయా లని, రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అయినా జిల్లాలో ఇప్పటివరకు సెంటర్ల ఏర్పాట్లు స్పీడందుకోలేదు. యాసంగిలో మూడెకరాల్లో వరి వేసిన. ఎకరానికి రూ. 25 వేల వరకు పెట్టుబడి అయింది. మా ఊరిలో సర్కారు సెంటర్ ఓపెన్ చేయలే. వరి కోసి జనగామ మార్కెట్కు తెచ్చిన. క్వింటాల్కు రూ.1,526 ధర వేసిన్రు. సుమారు 100 బస్తాల ధాన్యం అమ్మిన. మా ఊరిలో కొనుగోళ్లు స్టార్ట్? అయితే అక్కడే అమ్మేవాడిని. సెంటర్? ఏర్పాటు కాకపోవడంతో మద్దతు ధర దక్కలేదు.

# స్త్రీ శిశు సంక్షేమ శాఖలో భర్తీకానీ పోస్టులు!



జగిత్యాల : సంవత్సరాల తరబడి అంగన్ వాడీ టీచర్, హెల్పర్ పోస్టులు భర్తీ కాకపోవడంతో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ లో లక్ష్యం నెరవేరడం లేదు. టీచర్లున్న కేంద్రాల్లో ఆయాలు లేకపోవడం, ఆయాలు ఉన్న కేంద్రాల్లో టీచర్లు లేకపోవడం వంటి పరిస్థితులున్నాయి. నిత్యం పోషణ ట్రాకర్లలో పిల్లల వివరాలు ఆన్లైన్ చేయడం, చదువు చె ప్పడం, వంట చేయడం, భోజనం వడ్డించడం, పిల్లల ఆలనా పాలన చూ సుకోవడం సమస్యగా మారుతోంది. టీచరు పోస్టులు ఖాళీ ఉంటుం డ డంతో చాలా కేంద్రాల్లో చదువు చెప్పడం సమస్యగా మారింది. పిల్లలను తీసుకొని రావడం, భోజనం వండి, వడ్డించడం మళ్లీ చిన్నారులను ఇంటి వద్ద వదిలివేయడం తోనే సరిపోతోంది. ఫలితంగా గర్భిణులు, బాలింతలకు ప్రతీ రోజు పోషకాహారం అందడం లేదు. చిన్నారులకు ప్రీస్కూల్ విద్య, పౌష్టికాహారం దూరమవుతోంది. జిల్లాలో 4 ఐసీడీఎస్ ప్రాజెక్టులు పనిచేస్తున్నాయి. ధర్మపురి, జగిత్యాల, మల్యాల, మెట్పల్లి కేంద్రాలుగా ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. నాలుగు ప్రాజెక్టుల పరిధిలో 1,065 అంగన్ వాడీ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ధర్మపురి ప్రాజెక్టు పరిధిలో 222, జగిత్యాల పరిధిలో 304, మ ల్యాల పరిధిలో 227, మెట్పల్లి పరిధిలో 312 ప్రాజెక్టులు పని చేస్తున్నా యి. జిల్లాలో గల 1,065 కేంద్రాలలో మెయిన్ అంగన్ వాడీ కేంద్రాలు 1,037, మినీ అంగన్ వాడీ కేంద్రాలు 28 ఉన్నాయి. ధర్మపురిలో 18, జగి త్యాలలో 10 మినీ అంగన్ వాడీ కేంద్రాలు న్నాయి. జిల్లాలోని అంగన్ వాడీ కేంద్రాల పరిధిలో 75,457 మంది గర్భిణులు, బాలింతలు, చిన్నారులు న్నారు. ఇందులో 9,456 మంది గర్భిణులు, 6,763 మంది బాలింతలు, 7,605 మంది 7 నెలల నుంచి సంవత్సరం చిన్నారులు, 29,431 మంది 1 సంవ త్సరం నుంచి 3 సంవత్సరాల్లోపు చిన్నారులు, 22,203 మంది 3 సంవత్స రాల నుంచి 6 సంవత్సరాల్లోపు చిన్నారులున్నారు. జిల్లాలోని పలు అంగన్ వాడీ కేంద్రాల్లో టీచర్లు, హెల్పర్ల పోస్టులు ఖా ళీగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 116 అంగన్ వాడీ హెల్పర్ల ఖాళీలున్నా యి. ఇందులో జగిత్యాల ప్రాజెక్టు పరిధిలో 23, ధర్మపురి ప్రాజెక్టులో 24, మల్యాల ప్రాజెక్టులో 27, మెట్పల్లి ప్రాజెక్టు పరిధిలో 42 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.జిల్లాలో 30 అంగన్ వాడీ టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో ధర్మపురి ప్రాజెక్టు పరిధిలో 10 పోస్టులు, జగిత్యాల ప్రాజెక్టులో 4 పోస్టులు, మల్యాల ప్రాజెక్టులో 8 పోస్టులు, మెట్పల్లి ప్రాజె క్టు పరిధిలో 8 టీచర్ల పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. నాలుగేళ్లుగా అం గన్ వాడీ పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్ వైజర్ పోస్టులు సైతం పలు ప్రాంతాల్లో ఖాళీగా ఉన్నాయి.

# గుట్టల్లో అడ్డు అదుపు లేకుండా మట్టి తవ్వకాలు?



గద్వాల : జోగులాంబ గద్వాల జిల్లాలో మట్టి తవ్వకాలు ఆగడం లేదు. ప్రభుత్వ భూములు, హ్యాండ్లూమ్ పార్క్ స్థలాలు, గుట్టల్లో అడ్డు అదుపు లేకుండా మట్టి తవ్వకాలు జరిపి కోట్ల రూపాయలకు పడగలెత్తుతున్నారు.చివరకు ప్రైవేటు ప్లాట్లు, రిజర్వాయర్లు, చెరువులను కూడా వదలడం లేదు. అడ్డుకోవాల్సిన పోలీస్, మైనింగ్ ఆఫీసర్లు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. గద్వాల మండలంలోని అనంతపురం గ్రామ సమీపంలో సర్వే నంబర్ 368 లో 100 ఎకరాల సర్కారు భూమి ఉంది. అందులో 50 ఎకరాల స్థలాన్ని హ్యాండ్లూమ్ పార్క్ కు కేటాయించారు. ఇక్కడ గుట్టుచప్పుడు కాకుండా రాత్రివేళ మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. ఖాళీగా ఉన్న మిగతా 50 ఎకరాల పొలంలోనూ తవ్వకాలు సాగిస్తున్నారు. గద్వాల టౌన్ కు సమీపంలోని శెట్టి ఆత్మకూరు వద్ద రాత్రి, పగలు తేడా లేకుండా తవ్వకాలు జరిపి గుట్టలను కరగదీస్తున్నారు.అనంతపురం, వీరాపురం గ్రామ శివారులోని ప్రభుత్వ భూముల్లో దర్జాగా తవ్వకాలు జరుగుతున్నాయి. చెంగంపల్లి, ములకలపల్లె శివారులోని అసైన్డ్ భూముల్లో మట్టిని తవ్వి గద్వాల టౌన్ కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గట్టు మండలం ముచ్చోనిపల్లి రిజర్వాయర్ లో రెండు రోజుల నుంచి రాత్రివేళలో జేసీబీలు, టిప్పర్ల ద్వారా అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు పసిగట్టి టిప్పర్లను అడ్డుకొని, పోలీసులకు కంప్లైంట్ చేశారు. చిన్నోనిపల్లి రిజర్వాయర్ నుంచి మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని నిర్వాసిత రైతులు ఆరోపిస్తున్నారు. గద్వాల టౌన్ సమీపంలో ప్రైవేట్ వ్యక్తుల ప్లాట్లలోనూ కొన్ని నెలల కింద తవ్వకాలు జరిపి మట్టిని అమ్ముకున్నారు. దీనిపై లబ్ధిదారులు అప్పట్లో ధర్నాలు, నిరసనలు వ్యక్తం చేశారు. కానీ వారిని ఎలాంటి న్యాయం జరగలేదు. వెంచర్లకు, ఇంటి నిర్మాణాలకు మట్టి అవసరం చాలా ఉంటుంది. దీంతో మట్టికి ఫుల్ డిమాండ్ ఉండటంతో అధికార పార్టీ లీడర్లే మాఫియాగా మారి తవ్వకాలు జరుపుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. భూమి కొని, పర్మిషన్ తీసుకొని మట్టి తోడి.. అమ్మితే తక్కువ లాభాలు వస్తాయి. అదే ఇల్లీగల్ గా సర్కార్ భూములు, హ్యాండ్లూమ్ పార్క్ లో తవ్వి, అమ్మితే పెద్ద ఎత్తున లాభాలు వస్తాయని ఆశించి.. ఆఫీసర్లను మేనేజ్ చేసి ఇష్టానుసారంగా తవ్వకాలు జరుపుతున్నారు. ఒక టిప్పర్ మట్టి రేటు ఆరు వేల నుంచి ఎనిమిది వేల వరకు పలుకుతోంది. దీంతో కోట్లల్లో ఆర్జిస్తున్నారు.

హ్యాండ్లూమ్ పార్క్ నుంచి ఇటిక్యాల మండలానికి చెందిన ఒక వెంచర్ కి తరలించి పెద్ద ఎత్తున డబ్బు దండుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మట్టి మాఫియా అక్రమ తవ్వకాలతో హ్యాండ్లూమ్ స్థలం అన్యాక్రాంతం అవుతోంది. కలెక్టర్ స్పందించి పార్క్ స్థలాన్ని కాపాడాలి. ఆఫీసర్లు చర్యలు తీసుకోకపోతే అక్కడ గుంతలు తప్ప ఏమీ ఉండదు. ఇప్పటికే చాలా నష్టం జరిగింది.

# సంఘాల పేరు.. వ్యాపారం జోరు!



ఆదిలాబాద్ : పట్టణం నడిబొడ్డున ఉన్న ఈ కల్యాణ మండపం ఓ ఉద్యోగ సంఘానికి చెందినది. శుభకార్యాలకు అద్దెకు ఇచ్చి ఏటా రూ.లక్షల్లో ఆర్జిస్తున్నా.. వ్యాపార రుసుము చెల్లించడం లేదని బల్దియా సిబ్బంది స్పష్టం చేశారు. ఓ కుల సంఘానికి సంబంధించిన స్థలంలో ఈ కల్యాణ మండపాన్ని నిర్మించారు. దీనికి సంబంధించి ఏటా ఆస్తి పన్ను రూ.17,608 చెల్లిస్తున్నారు. కానీ ఈ మండపానికి వ్యాపార రుసుము చెల్లించడం లేదు. జిల్లా కేంద్రంలో తోపుడు బండిపై వ్యాపారం చేసే నిరుపేదలు సైతం ప్రతిరోజూ బల్దియాకు తైబజారు పేరిట రూ.10 చెల్లిస్తున్నారు. కానీ కొన్ని కల్యాణమండపాల వారు మాత్రం నయా పైసా చెల్లించకుండా యథేచ్ఛగా వ్యాపారం చేస్తున్నారు. ఆయా సంఘాలకు చెందిన కల్యాణ మండపాలను అద్దెకు ఇచ్చి ఏటా రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారు. సామాన్యులు ట్రేడ్ అనుమతులు తీసుకోకుంటే ఒత్తిడి చేసే బల్దియా అధికారులు వారి జోలికి వెళ్లడంలేదు. ఉద్యోగ, కుల సంఘాల వారు సమావేశాలు నిర్వహించుకునేందుకు, వారి సాధకబాధకాలు చర్చించుకునేందుకు అవసరమైన సంఘ భవనాల కోసం ప్రభుత్వం స్థలాలు కేటాయిస్తుందన్న విషయం తెలిసిందే. ఆదిలాబాద్ పట్టణంలో ఆయా సంఘాలకు చెందిన స్థలాలు ప్రస్తుతం రూ.వందల కోట్ల విలువ చేస్తాయి. అయితే వాటి యాజమాన్యాలు సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసుకునేందుకు ఆ స్థలాలను వ్యాపారపరంగా వినియోగిస్తున్నాయి. అనుమతి లేకున్నా కల్యాణ మండపాలను నిర్మించి శుభకార్యాల నిమిత్తం అద్దెకు ఇస్తున్నారు. కొన్ని సంఘాల వారు ఇతరులతో ఏటా కొంత మొత్తానికి ఒప్పందం చేసుకుని లీజుకు ఇచ్చేశారు. ఫంక్షన్ హాలును బట్టి రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు ప్రజల నుంచి వసూలు చేస్తున్నారు. ఇలా ఏటా దాదాపు రూ.20 లక్షలకు పైనే ఆర్జిస్తుండటం గమనార్హం. బల్దియా పరిధిలో ఆస్తులున్న వారు తప్పకుండా ఏటా ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఉద్యోగ సంఘాలకు సంబంధించిన భవనాలకు మాత్రం ఆస్తి పన్ను నుంచి మినహాయింపును ఇస్తూ గతంలో ప్రభుత్వం జీఓ జారీ చేసింది. ఇదే సాకుతో వారు కల్యాణ మండపాలను ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేస్తున్నా.. రుసుములు సైతం చెల్లించడం లేదని బల్దియా వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో ఏటా బల్దియా ఆదాయానికి గండి పడుతోంది. కుల సంఘాలకు చెందిన ఫంక్షన్ హాళ్లకు ఈ రెండింటికీ మినహాయింపు లేదు. వారు ఆస్తి పన్ను, వ్యాపారరుసుము చెల్లించాల్సి ఉంటుంది. తాజాగా బల్దియాలో కొత్త వ్యాపారరుసుము విధానాన్ని అమలు చేస్తుండడంతో.. ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. కల్యాణ మండపాల విస్తీర్ణాన్ని బట్టి రుసుము మహా అయితే రూ.50 వేల వరకు రావొచ్చు. రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా సదరు వర్గాలు వ్యాపార అనుమతులు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# అంగనవాడీలో నాణ్యతతో కూడిన సేవలందించాలి



ఖమ్మం :అంగనవాడీ కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు నాణ్యతతో కూడిన సేవలందించాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా సమీక్ష సమావేశంలో ఆర్జేడీ ఝాన్సీ లక్ష్మీబాయి అన్నారు.నగరంలోని డీపీఆర్సీ భవనంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సంక్షేమ అధికారులు, సీడీపీవోలు, సూపర్వైజర్లు, సఖీ, ఐసీపీఎస్, మినిస్ట్రీయల్ స్టాఫ్ సిబ్బందితో మహిళా శిశు సంక్షేమ శాఖ వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని క్షేత్రస్థాయిలో అంగనవాడీ సేవలు లబ్ధిదారులకు చేరే విధంగా సిబ్బంది కృషి చేయాలన్నారు. అంగనవాడీ కేంద్రాల్లో లబ్ధిదారుల వివరాలు విధిగా నమోదు చేస్తూ పెరుగుదల పర్యవేక్షణ, వెయ్యి రోజుల తల్లీబిడ్డల పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించి ఆరోగ్య తెలంగాణ నిర్మాణంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది భాగస్వాములు కావాలని అధికారులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా మంజూరైన అంగనవాడీ భవన నిర్మాణాలు త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటూ, క్షేత్రస్థాయిలో అంగనవాడీ టీచర్లు పూర్వ ప్రాథమిక విద్య, ఆరోగ్యలక్ష్మి అంగనవాడీ కేంద్రాల్లో పెరటి తోటల పెంపకాలపై శ్రద్ధ చూపించాలని పేర్కొన్నారు. అంగనవాడీ క్షేత్రస్థాయి పర్యవేక్షకుడు (సూపర్వైజర్లు) తమ సర్వీస్ రిజిస్టర్లు అప్డేట్ చేసుకోవాలని, సూపర్వైజర్లు క్షేత్రస్థాయి పర్యటనలో అంగనవాడీ కేంద్రాల్లో ఆహారనిల్వలపై ఎప్పటికప్పుడు జిల్లా అధికారులకు తెలియజేస్తూ పౌష్టికాహారంలో ఇబ్బందులు రాకుండా చూసుకుంటూ నాణ్యమైన సవలు అందించాలని, అంగనవాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలకొరకు వినియోగిస్తున్న న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం పోషణ ట్రాకర్ అప్లికేషన్లపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఖమ్మం జిల్లా సంక్షేమ అధికారిణి సీహెచ్ సంధ్యా రాణి, భద్రాద్రి జిల్లా సంక్షేమ అధికారిణి లెనినా, ఉమ్మడి జిల్లా సీడీపీవోలు, ఏసీడీపీవో, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# బృహత్ ప్రణాళిక ముసాయిదాపై ఆందోళన..




నిర్మల్ :ఇప్పటికీ 30 ఏళ్లు దాటింది. నిబంధనల ప్రకారం 15 ఏళ్లకోసారి మాస్టర్ప్లాన్ రివైజ్డ్ చేయాల్సి ఉన్నా.. ఈ విధానం అమలు కాలేదు. పాదతే అమలు అవుతోంది."ప్రస్తుతం జిల్లా కేంద్రమైన నిర్మల్ పట్టణ మాస్టర్ప్లాన్ ముసాయిదాపై చర్చ జరుగుతోంది. ముసాయిదాలో ప్రతిపాదించిన జోన్లపై కొంతమంది రైతులు, ప్రజల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. ఇప్పటికే దాదాపు వందకుపైగా అభ్యంతరాలు వచ్చాయి. వీటిన్నంటికీ పరిగణలోకి తీసుకుంటామని 'పుర' పాలకులు, అధికారులు స్పష్టం చేస్తున్నా.. వారిలో అయోమయం నెలకొంది. కామారెడ్డి, జగిత్యాల పట్టణాల కొత్త మాస్టర్ప్లాన్ ముసాయిదా అంశం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. పట్టణంలోని మంజులాపూర్ శివారు ప్రాంతంతోపాటు కంచెరోని చెరువు కింద భూములను పరిశ్రమల జోన్గా ప్రతిపాదించారు. ప్రధాన రహదారికి దూరంలో ఉన్న ఈ భూములను పరిశ్రమల జోన్ ఎలా పెడతారంటూ రైతులు వ్యతిరేకించడంతోపాటు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. వీటి మార్పు చేయిస్తామని 'పుర' పాలకులు, అధికారులు హామీ ఇచ్చారు. పబ్లిక్ అండ్ సెమీ పబ్లిక్ జోన్ : జిల్లా కేంద్రం శివారు ప్రాంతమై బంగల్పేట్ సమీపంలో ప్రతిపాదించారు. నిబంధనల ప్రకారం నివాస, వాణిజ్య భవనాలు, లేఅవుట్లకు అనుమతి ఇవ్వరు. కేవలం ప్రభుత్వ కార్యాలయాలకు మాత్రమే ఉంటుంది. వాస్తవానికి బంగల్పేట్ సమీపంలో ఇళ్లు ఉన్నాయి. దీనికి కొద్ది దూరంలోనే నూతన కలెక్టరేట్ నిర్మాణం జరుగుతోంది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాంతంలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారంతా ఆందోళన చెందుతున్నారు. సిద్ధాపూర్ ప్రాంతంలో సర్వే నెంబర్లు 131 నుంచి 139 వరకు, 146, 171, 172, 173, 225, 229లను ఇందులో చేర్చారు. ఈ భూముల్లో ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలు అయోమయంలో పడ్డారు. ఈ సర్వే నంబర్లను మాస్టర్ప్లాన్ నుంచి తొలగించి రెసిడెన్షియల్ జోన్గా చేయాలని అధికారులకు దరఖాస్తులు ఇచ్చారు.

# గుండెపోటు రాకుండా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..?

ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా గుండెపోటు వస్తున్నది. చిన్నవయసు వారిలోనూ గుండెపోటు రావడం కలవరానికి గురిచేస్తున్నది. మన జీవనశైలి, మన ఆహారం అలవాట్లే గుండె పనితీరుపై ప్రభావం చూపుతుందని తెలిసినా మనం వాటిని వదిలించుకోవడం లేదు. సరికదా ప్రమాదకరంగా మారగానే అప్పుడే అలవాట్లు మార్చుకుని ఉంటే బాగుండేది అంటూ సలహాలు ఇస్తుంటాం. ఇది సర్వసాధారణంగా తయారైంది. అలాకాకుండా గుండెపోటు ఎందుకు వస్తుంది..? రాకుండా ఉండాలంటే ఏంచేయాలి..? కారకాలను ఏవిధంగా దూరం చేయాలి..? అనే విషయాలపై ప్రతీ ఒక్కరు దృష్టిసారించాలి. గుండె పోటు వచ్చేటప్పుడు సంకేతాలుగా తొలుత అరగంట లేదా అంతకంటే ముందు ఛాతీలో నొప్పి ప్రారంభమవుతుంది. ఎడమ చేతిలోనూ నొప్పి వస్తుంది. ఆ వెంటనే విపరీతంగా చెమటలు కనపిస్తాయి. వీటిని మనం వెంటనే గుర్తించకపోతే అది మనల్ని ప్రమాదంలోకి నెట్టేసే అవకాశం ఉంటుంది. మహిళల్లో కంటే పురుషుల్లోనే గుండెపోటు ఎక్కువగా సంభవిస్తుంది. దీనికి ప్రధాన కారణంగా మగవారిలో ఉండే అలవాట్లు, జీవనశైలి. వీటిపై దృష్టి పెట్టి ఆహార విహారాల్లో మార్పులు చేసుకోవడం ద్వారా గుండెపోటు ప్రమాదాన్ని నివారించుకోవచ్చు అని వైద్య నిపుణులు సెలవిస్తున్నారు. సిగరెట్ స్మోకింగ్ అలవాటు ఇటీవల ఎక్కువైంది. ఫ్యాషన్గా యువకులు సిగరెట్ స్మోకింగ్ చేస్తూ తమ ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేసుకుంటున్నారు. సిగరెట్లో ఉండే రసాయనాలు రక్తాన్ని చిక్కగా చేస్తాయి. అలా చిక్కగా మారడం వలన సిరలు, ధమనుల లోపలి గోడల్లో గడ్డలను ఏర్పడుతాయి. ఇలా గడ్డలు సిరలు, ధమనుల్లో గడ్డ కట్టి రక్తప్రవాహాన్ని అడ్డుకోవడం వలన గుండెపోటు ప్రమాదం పెరుగుతుంది. ఇది ఆకస్మిక మరణానికి కూడా దారి తీస్తుందని గుర్తించాలి. సిగరెట్ స్మోకింగ్ అలవాటును మానుకోవడం ద్వారా గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. అధిక రక్తపోటు స్థాయిలను అదుపులో పెట్టుకోవడంపై ప్రతీ ఒక్కరూ దృష్టిపెట్టాలి. ఇది గుండెకు ఎంతో ప్రయోజనకారి అని గుర్తించాలి. అధిక రక్తపోటు వచ్చినప్పుడు ధమనులు సాగేలా అవుతాయి. ఇలా ధమనులు సాగడం వల్ల గుండెకు ఆక్సిజన్, రక్తం ప్రవాహాన్ని తగ్గిస్తుంది. ఫలితంగా గుండెపోటుకు దారితీస్తుంది. అందుకని అధిక రక్తపోటు లేకుండా జాగ్రత్తపడాలి. రక్తపోటును తగ్గేందుకు సాయపడే ఆహారాలను నిత్యం తింటూ ఉండాలి. శరీరంలో కొలెస్ట్రాల్ ఉండాలి. కానీ చెడు కొలెస్ట్రాల్ ఉండటం వలన గుండె ఆరోగ్య సమస్యలు వస్తుంటాయి. ఒక వ్యక్తి శరీరంలో పేరుకుపోయే చెడు కొలెస్ట్రాల్ ఆ వ్యక్తిలో గుండె జబ్బుల ప్రమాదాన్ని రెట్టింపు చేస్తుంది. అధిక కొలెస్ట్రాల్ ధమనల గోడల్లో పేరుకుపోయి రక్త ప్రవాహం సాఫీగా జరగకుండా అడ్డుకుంటుంది. ఫలితంగా గుండెకు రక్తం సరఫరా తగ్గిపోయి ఆక్సిజన్ సరిగా అందక గుండెపోటు వచ్చే అవకాశాలుంటాయి. అందుకని మనం నిత్యం తీసుకునే ఆహారాల ద్వారా మంచి కొలెస్ట్రాల్ మాత్రమే శరీరానికి అందేలా చూసుకోవాలి.

శరీరంలో అధిక చక్కెరల మోతాదులు కూడా గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. శరీరం అధిక బరువు కారణంగా ధమనుల్లో కొవ్వు ప్రదార్థాలు పేరుకుపోయేందుకు దారితీస్తుంది. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ధమనులు దెబ్బతిన్నట్లయితే అది గుండెపోటుకు దారితీయవచ్చు. అందుకని శరీరం అధిక బరువును లేదా ఊబకాయాన్ని నివారించుకునేలా చూసుకోవాలి. అధిక బరువును అధిగమించే ఆహారాలను తీసుకుంటూ రక్తంలోకి అధిక మొత్తంలో చక్కెరలు రక్తనాళాలు, నరాలను దెబ్బతీస్తాయి. గుండెకు రక్తం సరఫరా కాకుండా అడ్డుకోవడమే కాకుండా ఆక్సిజన్, పోషకాలను సరఫరా చేయకుండా అడ్డుకుంటుంది.

# ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు




దస్తురాబాద : బీఆర్ఎస్ హయాంలోనే ప్రతి ఇంటికీ ఏదో ఒక రూపంలో సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖా నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన 29 కల్యాణలక్ష్మి, రూ.3 లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ముస్లింలకు రంజాన్ తోఫాను ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులతో కలిసి పంపిణీ చే శారు. అంతకుముందు మండల కేంద్రంలో దొమ్మరి సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.2 లక్షల ప్రొసీడింగ్ పత్రాన్ని అందజేశారు. మున్యాల తండాలోని భీమన్న గుడికి మట్టిరోడ్డు నిర్మాణం కోసం ఆమె భూమిపూజ చేశారు. ఎలక్షన్లు దగ్గర పడుతున్నాయని, గ్రామాల్లో బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పర్యటిస్తూ లేనిపోని మాటలు చెబుతున్నారని, వారి మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని సూ చించారు. పని చేసే ప్రభుత్వాన్ని గుర్తించి, బీఆర్ఎస్ వెంట ప్రజలు ఉండాలని కోరారు. కాగా, ఎమ్మెల్యేకు వీవోఏలు వినతి పత్రం అం దజేశారు. పార్టీ బలోపేతానికి, గెలిపించడానికి ప్రతి కార్యకర్త సైనికు డిలా పని చేయాలని ఎమ్మెల్యే అజ్మీరా రేఖా నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ఆమె సమావేశం నిర్వహించారు. పార్టీ కోసం మనందరం కష్టపడాలని పేర్కొన్నారు. ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్‌దే గెలుపు అని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ, కాంగ్రెస్ లను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమాల్లో జడ్పీటీసీ శారద–శ్రీనివాస్, ఎంపీపీ సింగరి కిషన్, వైస్ ఎంపీపీ భూక్యా రాజు నాయక్, మండల కో–ఆప్షన్ సభ్యుడు ముస్తాఫా, ఎంపీటీసీ వెడ్మా మాన్కు, దుర్గం సునీత–రాజలింగం, సర్పంచ్‌లు నిమ్మతోట రాజమణి–శివయ్య, దుర్గం శంకర్, ముప్కే అంజన్న, నాగావత్ సురేశ్ నాయక్, ఉప సర్పంచ్ మాణిక్యరావ్, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో విజయ్ భాస్కర్ రెడ్డి, డీటీ తెలంగ్‌రావు, ఆర్ఐ పీవీ నర్సయ్య,బీఆర్ఎస్ మండలా ధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ముడికే ఐలయ్య యాదవ్, రాజనర్సయ్య, రైతు బంధు గ్రామ అధ్యక్షులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

# కంటితుడుపుగానే పరిహారం



సిరిసిల్ల : యాసంగి పంట చేతికి వచ్చే దశలో అకాల వర్షం, వడగండ్లతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. పంట నష్టం సర్వేలో 33 శాతం పంట దెబ్బతింటేనే పరిహారం కిందికి రావడంతో చాలా మంది రైతులకు నిరాశే ఎదురైంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మండలాల్లో రైతులు యాసంగిలో అకాల వర్షానికి పెద్ద ఎత్తున పంట దెబ్బతిన్నా కంటి తుడుపు సాయం మంజూరైందని రైతులు భావిస్తున్నారు.ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో గత నెల 17 నుంచి 21వ తేదీ వరకు వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటల్లో 219 మంది రైతులకు సంబంధించి 192 ఎకరాల్లో నష్టం వాటిల్లిన దానికి ప్రభుత్వం ప్రకటించిన ఎకరానికి పది వేల చొప్పున రూ.19.20 లక్షలు పరిహారం ప్రకటించారు. కేవలం ఐదు మండలాలకు సంబంధించిన రైతులకు మాత్రమే పరిహారం అందించనున్నారు. మిగతా మండలాల్లో కొద్ది మేరకు పంటలు దెబ్బతినా వాటిని పరిగణలోకి తీసుకోలేదు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వర్షాలకు పంట నష్టపోతే కేవలం ఐదు మండలాలకే పరిహారం అందించారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ సర్వేలో ప్రభుత్వం నిబంధనల ప్రకారం 33 శాతం పంట నష్టం జరిగితేనే గుర్తిస్తారు. యాసంగిలో అన్ని మండలాల్లో పంటల్లో వరి, మొక్కజొన్న, మామిడి దెబ్బతింది. జిల్లాలో యాసంగిలో 1.72 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో ప్రధానంగా వరి 1.70 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 753 ఎకరాలు, నువ్వులు 167 ఎకరాలు, గోధుమ 87 ఎకరాల్లో సాగైంది. అల్పపీడన ప్రభావంతో వడగండ్ల వర్షానికి జిల్లాలో 5 వేల ఎకరాల వరకు వరి, 290 ఎకరాల వరకు మామిడితో పాటు మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయని ప్రాథమికంగా అంచనా ఉంది. ప్రభుత్వం మాత్రం జిల్లాలోని 219 మంది రైతులకు 192 ఎకరాలు రూ.19.20 లక్షల పరిహారం మంజూరు చేశారు. 90 రోజుల్లో బాధిత రైతు ఖాతాల్లో డబ్బులు జమకానున్నాయి. వర్షాలు, వడగండ్లు, ఈదురు గాలులతో అరుగాలం కష్టపడి పండించిన పంటలు ప్రతి యేటా చేతికి అందకుండానే పోతున్నాయి. గత మూడేళ్లుగా పంటలు దెబ్బతిన్న ప్రతిసారి వ్యవసాయ శాఖ సర్వే చేయడం, నివేదికలు ప్రభుత్వానికి పంపించినా పరిహారం మాత్రం అందడం లేదు. గతంలో దెబ్బతిన్న పంటలకు ఎంతో కొంత పరిహారం ప్రభుత్వం అందించేది. అధిక వర్షాలు, వడగండ్లతో ఖరీఫ్, రబీ ప్రతి సీజన్‌లోనూ రైతులు పంట నష్టాన్ని చవిచూస్తున్నారు. గతంలో జిల్లాలో సిరిసిల్ల, చందుర్తి, వేములవాడ, రుద్రంగి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట, బోయినపల్లి మండలాల్లో వరి, పత్తి, ఇతర పంటలు దెబ్బతిన్నాయి. ప్రభు త్వానికి పంపిన నివేదిక ప్రకారమే 3,653 మంది రైతులకు సంబంధించి 2021– 22 సంవత్సరంలో 1195 హెక్టార్ల వరకు పంట నష్టానికి సంబంధించి రూ.2.52 కోట్లు నష్టం వాటిల్లినట్లు ఉన్నది. ఇప్పటి వరకు వాటికి సంబంధించిన ఊసే లేదు. పంటలు దెబ్బతిన్న ప్రతిసారి ఎకరానికి రూ.15 నుంచి 20 వేల వరకు నష్టపోతున్నారు. ఈ సారి యాసంగి సీజన్‌లో రైతులు పంటనష్టం కేసీఆర్ పంట నష్టాన్ని పరిశీలించి ఎకరానికి రూ పది వేల పరిహారం ప్రకటించారు. గతంలో జాతీయ విపత్తు కింద ఇచ్చిన పంటనష్టం ఇన్‌పుట్ సబ్సిడీ జీవో ముగిసి దాదాపు మూడేళ్లు దాటిపోయింది. అప్పటి నుంచి పకృతి కన్నెర్ర చేసి పంటనష్టం వాటిల్లినా నివేదికలకే పరిమితం అవుతూ పరిహారం కోసం రైతులు ఎదురు చూసే పరిస్థితి నెలకొంది.

# సర్పంచులు, ఎంపీటీసీలపై చిన్నచూపు



హుస్నాబాద్ం : బీఆర్ఎస్ పార్టీలో తమకు గుర్తింపు కరువైందని, ఎమ్మెల్యే కొందరికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తూ తమను చిన్నచూపు చూస్తున్నారని హుస్నాబాద్ మండల సర్పంచులు, ఎంపీటీసీలు వాపోయారు. గెలిచిన నాటి నుంచి తాము చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమ సమస్య తీర్చాలని పలుమార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదని ఆందోళన చేపట్టారు.హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మానస ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎసకు చెందిన సర్పం చులు మాట్లాడుతూ గ్రామ ప్రజలు తమపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించారని, కానీ వారి విశ్వాసాన్ని పొందలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్లు పూరైనా కనీసం ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేకపోయామని, కొత్తగా పింఛన్లు లేవని, దళితబంధు, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మంజూరు లేదని వాపోయారు. గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లు, మురుగు కాలువల పనుల బిల్లులు చెల్లించడం లేదని, పంచాయతీ ట్రాక్టర్ల నిర్వహణ భారంగా మారిందని తమ గోడును వెల్లబోసుకున్నారు. ఎంపీటీసీలకు ప్రత్యేక ని?ధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు చెప్పుకుందామంటే ఎమ్మెల్యే మండల సమావేశానికి హాజరుకావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పల్లెప్రగతిలో చేపట్టిన అభివృద్ధి పనులు ఆగిపోయాయని తెలిపారు. ఎనిమిది నెలల నుంచి అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు రావడం లేదన్నారు. పంచాయతీ కార్మికులకు ఆరుమాసాల వేతనాలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఈ డిమాండ్లను వారం రోజులలోపు ప్రభుత్వం తీర్చే విధంగా ఎమ్మెల్యే కృషి చేయాలని, లేదంటే మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధంగా ఉన్నట్లు సర్పంచులు, ఎంపీటీసీలు ఎంపీపీ లకావత్ మానసకు తమ సమస్యల డిమాండ్ల పత్రాన్ని అందజేశారు.

## పంచాయతీ కార్మికులకు
# కనీసవేతనం అమలు చేయాలి




గజ్వేల్, : గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని పాలకేంద్రం నుంచి సంగాపూర్ కమాన్ మీదుగా ఐవోసీ వరకు ర్యాలీ నిర్వహించి, ఐవోసీ గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఏవో అహ్మద్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకుంటే గ్రామపంచాయతీ కార్మికులు ఎలా బతుకుతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత ఐదేళ్లుగా వేతనాలు పెంచకుండా జీపీ కార్మికులను ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తున్నదని, రూ.8,500లతో కుటుంబం ఎలా గడుస్తుందని ప్రశ్నించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీల్లో పనిచేసే కార్మికుల్లో 99శాతం మంది దళిత, నిరుపేదలేనని, వారికి కనీసం గ్రామాల్లో కనీసం అప్పులు కూడా పుట్టడం లేదన్నారు. ప్రతి నెలా ఇవ్వవలసిన సబ్బులు, నూనెలు సంవత్సరానికి రెండు జతల బట్టలు ఇవ్వడం లేదని, బీమా సౌకర్యం కల్పించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని బకాయిపడిన వేతనాలను అందించాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన 30శాతం పీఆర్‌సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వారితో గ్రామపంచాయతీ కార్మిక సంఘం నాయకులు యాదగిరి, బాబురావు, ఎల్లం, కనకవ్వ, రేణుక, బాలమణి, నగే?శ్, నాగరాజు, జహంగీర్, లక్ష్మి, గణేశ్, చెన్నయ్య, అనిల్, శ్రీనివాస్,. పోశయ్య, అర్జున్ తదితరులున్నారు.

# పంట నష్ట పరిహారం ఏది..?



కరీంనగర్ :అధైర్యపడకండి.. నేనున్నాను.. అన్న ముఖ్యమంత్రి అన్న మాటల తో గుండె ధైర్యాన్ని పెంచుకున్న రైతులలో మెల్లమెల్లగా అది సడలి పోతున్నది. మార్చి చివరి వారంలో కురిసిన అకాల వర్షాలతో తీవ్ర పంట నష్టం జరిగింది. వరి, మొక్కజొన్న నేలవాలగా, మామిడి కాయలు రాలిపోయాయి. వాటర్ మిలన్, మస్క్ మిలన్ లాంటి తోటలు చేతికి రాకుండా పోయాయి. అకాల వర్షాలతో రైతులు నష్ట పోయారన్న విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి వెంటనే స్పందిం చారు. మార్చి 23న జిల్లాల్లో పర్యటించి నష్టపోయిన పంట చేల వద్దకు వచ్చి రైతులను పరామర్శించి వారికి జరిగిన నష్టాల గురించి తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని, తానున్నానని భరోసా నింపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎకరాకు 10 వేల రూపాయల సహాయం అందిస్తామని ప్రకటించారు. నష్టపోయిన రైతులు కోలుకునేందుకు ఈ సహాయం తోడ్పడుతుందని, గతంలో మాదిరిగా ఏళ్ల తరబడి ఎదురుచూడకుండా వారం రోజుల్లో పంట నష్టానికి ప్రభుత్వ సాయం అందుతుందని ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 2,28,258 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారని, ఇందు కోసం వెంటనే 228 కోట్లు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. ముఖ్యమంత్రి ప్రకటనతో పంట నష్టం జరిగిన విషయాన్ని కూడా మర్చిపోయి రైతులు ఎంతో ఆనందపడ్డారు. వారం రోజుల్లోగా తమకు జరిగిన నష్టానికి ప్రభుత్వ సాయం అందుతుందని ఆశించారు. ముఖ్యమంత్రి హామీ ఇచ్చి వెళ్లి 27 రోజులు గడిచినా ఆ సహాయం ఎప్పుడు అందుతుందో రైతులకు అర్థంకాని పరిస్థితి ఎదురవుతున్నది. గ్రామాల్లో తిరిగే వ్యవసాయ విస్తరణ అధికారుల నుంచి మొదలుకొని జిల్లాస్థాయి అధికారుల వరకు, ఇతర అధికారులు కూడా పంట నష్టం సహాయం ఎప్పుడు వస్తుందని అడిగితే మౌనమే సమాధానమ వుతున్నదని రైతులు అంటున్నారు. జిల్లాలో మార్చి చివరి వారంలో కురిసిన వర్షాలతో 13,500 ఎకరాల్లో వరి, 7,800 ఎకరాల్లో మొక్కజొన్న, 1600 ఎకరాల్లో మామిడి తోటలు, 250 ఎకరాల్లో వాటర్ మిలన్, మస్క్ మిలన్ తోటలు నష్ట పోయాయని వ్యవ సా యాధికారులు ప్రాథమిక నివేదికలిచ్చారు. ఈ నివేదికల ప్రకారం ఆయా రైతులకు 23 కోట్ల రూపాయల మేరకు సహాయం అందుతుందని అందరూ ఆశించారు. ఆ తర్వాత లెక్కలు మారాయనే విషయం తెలిసి రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వడగళ్ల వానకు వరి, మొక్కజొన్న నేల పడిపోయినా పంట నష్టం ఏమి ఉండదని, కొద్ది ఎకరాల్లో మాత్రమే నష్టం జరిగిందని వ్యవసాయాధికారులు రిపోర్టులు పంపించారని రైతులు ఆందోళన చెందుతున్నారు. 30 శాతం పంట నష్టం జరిగితేనే దానిని నష్టంగా పరిగణిస్తామని, ఆ మేరకు జిల్లాలో నష్టం జరగలేదని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారని మండలాల్లో రైతులు వాపోతున్నారు. జిల్లాలో 8,000 నుంచి 9,000 ఎకరాల్లో మాత్రమే పంట నష్టాన్ని నమోదు చేశారని సమాచారం అందుకున్న రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఎన్ని ఎకరాల్లో పంట నష్టపోయింది, ఏయే రైతులకు ఎంత నష్టం వాటిల్లింది వివరాలను వ్యవసాయశాఖ వెల్లడించకుండా రహస్యంగా ఉంచాల్సిన అవసరం ఏమున్నదని రైతులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు ప్రభుత్వానికి పంపించిన నివేదిక మేరకైనా ఆర్థిక సహాయంఎప్పుడు అందుతుందంటే జవాబిచ్చేవారే లేకుండా పోయారని రైతులువాపోతున్నారు. వర్షాలకు నేలవాలిన వరి పొలాల్లో, మొక్కజొన్నచేలలో దిగుబడి తగ్గుతుందని, ఆశించిన మేరకు పరిహారం రాదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో కొంత పంట వచ్చినా అది బాగున్నట్లుగానేగుర్తిస్తూ వ్యవసాయశాఖ అధికారులు అన్యాయం చేస్తున్నారని రైతులు విమర్శిస్తున్నారు. ప్రాథమిక అంచ నాలంటూ వ్యవసాయశాఖ ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక మేరకే పంట నష్టానికి ఆర్థికసహాయం అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయశాఖ వెంటనే పంట నష్టం వివరాలను, రైతుల వివరాలను, వారికి అందే సహాయం వివరాలను వెల్లడించి కార్యాలయాల వద్ద రైతులు చూసుకునేందుకు వీలుగా ఉంచాలని వారు కోరుతున్నారు.

# రైల్వే లాజిస్టిక్స్‌హబ్‌పై అవగాహన ఏదీ!




తూప్రాన్: మెదక్ జిల్లా తూప్రాన్–మనోహరాబాద్ మండలాల్లో హెచ్ఎండీఏ పరిధిలో రైల్వే లాజిస్టిక్స్‌హబ్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం రైల్వేట్రాక్‌కు సమీపంలో ఉన్న భూములను ల్యాండ్‌పూలింగ్ ద్వారా సేకరించాలని ప్రతిపాదించింది. ఈమేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ, మెట్రోపాలిటన్ కమిషనర్ (హెచ్ఎండీఏ) నుంచి జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు అందాయి. ప్రతిపాదిత భూములను పరిశీలించాలని తూప్రాన్ ఆర్డీవోను కలెక్టర్ ఆదేశించారు. రైతులు సుముఖత వ్యక్తంచేస్తే భూసేకరణ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైల్వే లాజిస్టిక్స్‌హబ్ ఏర్పాటు కోసం రైల్వేట్రాక్‌కు సమీపంలో ఉన్న 806. 37 ఎకరాల భూమి సేకరించాలని గుర్తించారు. ఈ భూముల్లో రైల్వే రేక్ పాయింట్లు, స్టాక్‌లు నిల్వ చేసే గోదాములు నిర్మించాలని ప్రతిపాదించారు. ఇందుకోసం తూప్రాన్ మండలం బ్రాహ్మణపల్లి శివారులో సర్వే నంబర్లు 44, 45, 71 నుంచి 76, 78, 86 నుంచి 90, 97లోని 146.32 ఎకరాలు, వెంకటాపూర్ (పీటీ) శివారులోని సర్వే నంబర్లు 4 నుంచి 17, 19 నుంచి 68, 75, 79 నుంచి 145, 153 నుంచి 160, 213, 214లోని 531.38 ఎకరాలు సేకరించాలని ప్రతిపాదించారు. మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేట శివారులో సర్వే నంబర్లు 34 నుంచి 43, 224 నుంచి 240 వరకు ఉన్న 128.07 ఎకరాలు గుర్తించారు. పట్టా భూములను ల్యాండ్‌పూలింగ్ కింద సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అభివృద్ధి చేసిన అనంతరం మొత్తం భూమిలో రైతులకు 60 శాతం అప్పగించి.. మిగిలిన 40 శాతం ప్రభుత్వం తీసుకోవాలని ప్రతిపాదించారు.రైల్వే లాజిస్టిక్స్‌హబ్ ఏర్పాటు కోసం ల్యాండ్‌పూలింగ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంపై రైతుల నుంచి వ్యతిరేకత ఎదురవుతున్నది. భూసేకరణ విషయం బయటకురావడంతో ప్రతిపాదిత గ్రామాల్లో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సాగు భూములు తీసుకుంటే జీవనోపాధిని కోల్పోతామని వాపోతున్నారు. భూసేకరణ చేపట్టవద్దని వెంకటాపూర్ (పీటీ), బ్రాహ్మణపల్లి, లింగారెడ్డిపేట గ్రామాలకు చెందిన రైతులు ఇటీవల కలెక్టర్‌కు విన్నవించారు. ల్యాండ్‌పూలింగ్ పథకంపై రైతులకు అవగాహన కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. ఈ పథకం కింద పట్టా భూములు సేకరిస్తే అభివృద్ధి చేసిన భూమిలో 60 శాతం తిరిగి రైతులకే కేటాయిస్తారు. ఆ విషయాన్ని రైతులకు వివరించడంలో అధికారులు విఫలమయ్యారు. అభివృద్ధి చేసిన అనంతరం భూముల విలువ పెరుగుతుందని, 60 శాతం భూమి తిరిగి రైతులకే రావడంతో లాభం ఉంటుందని చెప్పలేకపోతున్నారు. కచ్చితమైన సమాచారంతో రైతులకు అవగాహన కల్పిస్తే భూములిచ్చేందుకు ముందుకువచ్చే అవకాశం ఉంటుంది. రైల్వే లాజిస్టిక్‌హబ్, రేక్‌పాయింట్ ఏర్పాటయితే చుట్టుపక్కల భూమల విలువ కూడా పెరుగుతుంది. రైల్వే లాజిస్టిక్స్‌హబ్ ఏర్పాటు చేసేందుకు పట్టా భూములు సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. ఇందుకోసం ఎకరాకు రూ. 15 లక్షల లోపే పరిహారం ఇస్తారని రైతులు చర్చించుకుంటున్నారు. ల్యాండ్‌పూలింగ్‌పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. భూములను అభివృద్ధి చేసిన అనంతరం రైతులకు ఎకరాకు 1,800 గజాలు చొప్పున ఇస్తేనే అంగీకరిస్తాం.


# పోలవరంతో మునకే



భద్రాచలం, : పోలవరం ప్రాజెక్టుతో భద్రాచలంతో పాటు సమీప గ్రామాలకు ముంపు ముప్పు పొంచి ఉందని సాగునీటిరంగ నిపుణులు చేస్తున్న హెచ్చరికలు అక్షరసత్యాలని తేలింది. ఈ బహుళార్థకసాధక ప్రాజక్టుతో తెలంగాణ పరిధిలోని భద్రాచలం, బూర్గంపాడు సహా సమీప గ్రామాలకు ముంపు ప్రమాదం ఉంటుందని ఏపీ ప్రభుత్వం అంగీకరించింది. దీనిపై గతంలోనే పలు మార్లు సాగునీటి ఇంజనీరింగ్ నిపుణులు ప్రొఫెసర్ శివాజీరావు, విద్యాసాగర్‌రావు, వెంకటరెడ్డిలు హెచ్చరించారు. భద్రాద్రి ఏజెన్సీవాసులు సైతం రెండు దశాబ్దాలుగా పోలవరం ముంపు సమస్యపై గొంతెత్తుతున్నారు. అయినా ఎవరూ ఈ ప్రాంతవాసుల మొరను ఆలకించలేదు. గతంలోనే మణుగూరు భారజల కర్మాగారం, భద్రాచలం రామాలయ పరిసర ప్రాంతాల్లో సర్వే చేసి ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించాలని పీపీఏ, ఏపీఈలను సీడబ్ల్యూసీ ఆదేశించింది. కానీ ఏపీ మాత్రం ఇప్పటి వరకు అందులో కేవలం ఒక్క బూర్గంపాడు ముంపునకు సంబంధించిన సమాచారం మాత్రమే తెలంగాణకు అందజేసింది. సీడబ్ల్యూసీ సూచించిన విధంగా సంయుక్త సర్వేతో పాటు అయితే ఇంతకాలం పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపు లేదని వాదిస్తూ వచ్చిన ఆంధ్రప్రదేశ ప్రభుత్వం కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) ఆదేశాల నేపథ్యంలో ఎట్టకేలకు పోలవరంతో భద్రాచలం, బూర్గంపాడు పరిసర గ్రామాలకు ముంపు ముప్పు పొంచి ఉన్నమాట వాస్తవమేనని అంగీకరించింది. పోలవరం బ్యాక్‌వాటర్‌పై సీడబ్ల్యూసీ ఆదేశాలకు అనుగుణంగా ఏపీ ప్రభుత్వం ఒక మ్యాప్‌ను తెలంగాణకు అందించింది. పోలవరంలో 150అడుగులు(45.72 మీటర్ల)వద్ద నీటిని నిల్వ చేసినప్పుడు బూర్గంపాడు, భద్రాచలం పరిసరాల్లో ఉన్న ఆరు గ్రామాలపై ముంపు ప్రభావం ఉంటుందని తేలింది. గతంలోనే మణుగూరు భారజల కర్మాగారం, భద్రాచలం రామాలయ పరిసర ప్రాంతాల్లో సర్వే చేసి ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించాలని పీపీఏ, ఏపీఈలను సీడబ్ల్యూసీ ఆదేశించింది. కానీ ఏపీ మాత్రం ఇప్పటి వరకు అందులో కేవలం ఒక్క బూర్గంపాడు ముంపునకు సంబంధించిన సమాచారం మాత్రమే తెలంగాణకు అందజేసింది. సీడబ్ల్యూసీ సూచించిన విధంగా సంయుక్త సర్వేతో పాటు ఇతర అంశాలపై ఇప్పటికీ ఏపీ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తుండటం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంతో కాలంగా ముంపు ప్రమాదం పొంచి ఉందని ఆవేదన చెందుతున్న భద్రాచలం ఏజెన్సీవాసులు తాజాగా ఏపీ ప్రభుత్వమే దీన్ని అంగీకరించడంతో ఇకనైనా ముంపు నుంచి రక్షణ కల్పించేందుకు సత్వర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. సాగునీటి ఇంజనీరింగ్ నిపుణులు ప్రొఫెసర్ శివాజీరావు, విద్యాసాగర్‌రావు, వెంకటరెడ్డిలు హెచ్చరించారు. భద్రాద్రి ఏజెన్సీవాసులు సైతం రెండు దశాబ్దాలుగా పోలవరం ముంపు సమస్యపై గొంతెత్తుతున్నారు. అయినా ఎవరూ ఈ ప్రాంతవాసుల మొరనుపోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే బ్యాక్‌వాటర్ కారణంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని గ్రామాలతో పాటు చత్తీసగఢ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన సరిహద్దుల్లోని గోదావరి నదీ పరివాహక గ్రామాలు ముంపునకు గురికానున్నాయి. అయితే ఈ ముంపు ప్రభావం భారీగానే ఉంటుందని ఆందోళన వ్యక్తమవుతున్న నేఎథ్యంలో మరోసారి వర్షాకాలం సీజనలోపు సంయుక్త సర్వే నిర్వహించాలనే డిమాండ్ వినిపిస్తోంది. తద్వారా ముంపు ఎంత మేరకు ఉంటుందనేది అధికారికంగా గుర్తించి తక్షణ చర్యలు చేపడితే భద్రాచలం, బూర్గంపాడు పరిధిలో ముంపు బెడద తప్పే అవకాశం ఉంటుంది. నాణ్యతతో పనులను పూర్తి చేస్తేనే ముంపు ముప్పు తొలుగుతుందని ఈ ప్రాంతవాసులు అభిప్రాయపడుతున్నారు.

# డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని పునరుద్ధరించాలి

## - 1,800 మంది సంతకాలతో ఎన్‌సిఈఆర్‌టి డైరెక్టర్‌కు లేఖ



న్యూఢిల్లీ బ్యూరో : సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్‌ఈ) పదో తరగతి పాఠ్యాంశాల్లోని సైన్స్ సిలబస్ నుంచి జీవ పరిణామ సిద్ధాంతాన్ని ఉపసంహరించాలని ఎన్‌సిఈఆర్‌టి తీసుకున్న నిర్ణయంపై శాస్త్రవేత్తలు, సైన్స్ టీచర్లు, విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. సైంటిఫిక్ టెంపర్‌ను అభివృద్ధి చేసుకోవడం కోసం పరిణామ ప్రక్రియను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యమని తెలిపారు. దీని గురించి విద్యార్థులకు తెలియజేయకపోవడాన్ని తప్పుబట్టారు. దేశవ్యాప్తంగా సభ్యులుగల స్వచ్ఛంద సంస్థ బ్రేక్‌త్రూ సైన్స్ సొసైటికి చెందిన ఈ శాస్త్రవేత్తలు, సైన్స్ టీచర్లు, విద్యావేత్తలు బహిరంగ లేఖను రాశారు. పాఠ్యాంశాల నుంచి జీవ పరిణామాన్ని తొలగించడానికి వ్యతిరేకంగా ఈ లేఖను రాశారు. సెకండరీ ఎడ్యుకేషన్‌లో డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పదో తరగతి సిలబస్ నుండి బయోలాజికల్ ఎవల్యూషన్ థియరీని తొలగించాలని కేంద్రం ఉన్నత పాఠశాల పాఠ్యప్రణాళిక బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని విమర్శించారు. ఇది పాఠశాల సైన్స్ విద్యకు "ప్రమాదకరమైన మార్పు" అని పేర్కొన్నారు. ఈ లేఖపై దాదాపు 1,800 మంది సైంటిస్టులు, సైన్స్ టీచర్లు, విద్యావేత్తలు సంతకాలు చేశారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టిఐఎఫ్ఆర్), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్‌ఈఆర్), ఐఐటిలు వంటి ప్రముఖ సంస్థలకు చెందినవారు సంతకాలు చేశారు. సంతకం చేసినవారిలో కలకత్తాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ నుండి భౌతిక శాస్త్రవేత్త సౌమిత్రో బెనర్జీ ఉన్నారు. బెంగుళూరులోని ఇండియన్ ఇన్నిట్యూట్ ఆఫ్ సైన్స్ నుండి జీవశాస్త్రవేత్త రాఘవేంద్ర గడగ్కర్, బెంగళూరు నేషనల్ సెంటర్ ఫర్ బయోలాజికల్ సైన్సెస్ డైరెక్టర్, జీవశాస్త్రవేత్త ఎల్.ఎస్ శశిధర, ముంబై హౌమీ భాభా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ నుండి ఖగోళ భౌతిక శాస్త్రవేత్త అనికేత్ సూలే, ఐఐఎస్‌ఈఆర్ పూణే నుండి జీవశాస్త్రవేత్త సుధా రాజమణి తదితరులు ఉన్నారు. ఎన్‌సిఇఈఆర్‌టి డైరెక్టర్‌కు ఇమెయిల్ పంపారు. సైన్స్ ప్రాథమిక ఆవిష్కరణ గురించి విద్యార్థులకు తెలియకపోతే, వారి ఆలోచనా ధోరణి కుంటుపడుతుందని తెలిపారు. పరిణామ జీవ శాస్త్రాన్ని అర్థం చేసుకోవడం, దానిపై పట్టు సంపాదించడం జీవ శాస్త్రంలోని ఉప శాఖలకు చాలా ముఖ్యమని, అంతేకాకుండా, మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి కూడా చాలా కీలకమని తెలిపారు. సమాజాలుగా, దేశాలుగా మనం ఎదుర్కొంటున్న అనేక సమస్యలతో మనం ఏ విధంగా వ్యవహరించాలనే అంశాన్ని అత్యధికంగా ప్రభావితం చేసే శాస్త్ర విభాగం పరిణామ జీవ శాస్త్రమని తెలిపారు. ఔషధాలు, వైద్య రంగం నుంచి ఎపిడమియాలజీ, ఎకాలజీ, పర్యావరణం వంటివాటి నుంచి మానసిక ఆరోగ్య శాస్త్రం వరకు అన్నింటిలోనూ ఏ విధంగా వ్యవహరించాలో నిర్ణయించుకోవడంపై అత్యధిక ప్రభావం చూపే శాస్త్ర విభాగం పరిణామ జీవ శాస్త్రమని తెలిపారు. తోటి మానవులను మనం ఏవిధంగా అర్థం చేసుకోవాలి? జీవితంలో వారి స్థానం ఏమిటి? అనే అంశాలకు కూడా దీనితో సంబంధం ఉందన్నారు. మనలో చాలా మంది బాహాటంగా తెలుసుకోకపోయినప్పటికీ, ఏదైనా మహమ్మారి ఏ విధంగా వృద్ధి చెందుతుంది? కొన్ని జీవులు ఎందుకు అంతరించిపోతు న్నాయి? వంటి అనేక ఇతర ముఖ్యమైన అంశాల గురించి మనం అర్థం చేసుకోవడానికి సహజ ఎంపిక సిద్ధాంతాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఎన్‌సిఈఆర్‌టి ఇటీవల విడుదల చేసిన డాక్యుమెంట్‌లో పదో తరగతి పాఠ్య పుస్తకాల్లో సైన్స్ సబ్జెక్టులో చాప్టర్-9ను కేవలం 'హెరెడిటీ'గా మాత్రమే ఉంచినట్లు తెలిపింది. అంతకుముందు ఈ చాప్టర్ 'హెరెడిటీ అండ్ ఇవల్యూషన్' అని ఉండేది. ఈ చాప్టర్ నుంచి తొలగించిన భాగాల్లో, చార్లెస్ రాబర్ట్ డార్విన్, ఆరిజిన్ ఆఫ్ లైఫ్ ఆన్ ఎర్త్, మాలెక్యులార్ ఫైలోజెనీ, ఇవల్యూషన్, ట్రేసింగ్ ఇవల్యూషనరీ రిలేషన్‌షిప్స్ వంటివి ఉన్నాయి.

## ఆంక్షలు అధిగమిస్తూ..

# లోకేశ్ పాదయాత్ర



అమరావతి : తెలుగుదేశం పార్టీ యువనేత నారా లోకేశ్ చేపట్టిన పాదయాత్ర 1000 కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలో ఈ మైలురాయిని చేరుకుంది. ఈ సందర్భంగా లోకేశ్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. యువగళం పేరుతో జనవరి 27వ తేదీన కుప్పంలో ప్రారంభమైన పాదయాత్ర.. ఇప్పటి వరకు ఉమ్మడి చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో సాగింది. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో కొనసాగుతోంది. రాజకీయాల్లోకి అడుగు పెట్టిన తర్వాత లోకేశ్ ఇంత సుదీర్ఘ రాజకీయ యాత్రను చేపట్టడం ఇదే మొదటిసారి. పార్టీ ప్రధాన కార్యదర్శిగా పదేళ్ల క్రితం రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయన గతంలో మంత్రిగా పనిచేశారు. ప్రతిపక్ష పాత్రలో మరింత క్రియాశీలక పాత్ర పోషించేందుకు పాదయాత్రను ఎంచుకొన్నారు. పాదయాత్రలో... మంత్రులు, వైసీపీ ఎమ్మెల్యేల అవినీతిని వారి నియోజకవర్గాల్లోనే ఎండగడుతూ టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతున్నారు. మంత్రి పెద్దిరెడ్డి నియోజకవర్గం పుంగనూరులోనూ లోకేశ్ విమర్శల దాడి ఆపలేదు. మంత్రి, ఆయన అనుచరులపై వస్తున్న అవినీతి ఆరోపణల గురించి ప్రస్తావించారు. ధర్మవరంలో అధికార పార్టీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి భూ ఆక్రమణలకు పాల్పడ్డారంటూ డ్రోన్‌తో తీసిన చిత్రాలను లోకేశ్ విడుదల చేయడం సంచలనం కలిగించింది. కర్నూలు జిల్లాలో మంత్రి గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్యే శ్రీదేవికి సంబంధించి భూ ఆక్రమణలపై ఆయన లేవనెత్తిన అంశాలు చర్చనీయాంశమయ్యాయి. లోకేశ్ పాదయాత్రకు ఆటంకాలు కలిగించేందుకు అధికారులు ఎన్నో ఆంక్షలు విధించారు. జీవో 1 పేరుతో చిత్తూరు జిల్లాలో పోలీసులు పాదయాత్రపై ఉక్కుపాదం మోపారు. లోకేశ్‌పై మూడుచోట్ల కేసులు పెట్టారు. ఆయన చుట్టూ ఉన్నవారిపై కనీసం 25కేసులు నమోదయ్యాయి. పాదయాత్రలో రైతులు, కార్మికులు, మహిళలు, ఎస్సీలు, బీసీలు, వివిధ వర్గాల ప్రజలతో లోకేశ్ సమావేశమై వారి సమస్యలు తెలుసుకొంటున్నారు. ఇప్పటి వరకు 27 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 14, ఉమ్మడి అనంతపురం జిల్లాలో 9, ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇప్పటికి 4 నియోజకవర్గాల్లో పాదయాత్ర సాగింది. ఇప్పటి వరకు రోజుకు సగటున 13కిలోమీటర్లు నడిచారు. ఇప్పటి వరకు లోకేశ్ పాదయాత్రకు రెండుసార్లు మాత్రమే విరామం ఇచ్చారు. సినీ నటుడు, బంధువు తారకరత్న మరణించినప్పుడు అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ఒకసారి, పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సమయంలో పోలీసులు నోటీసు ఇవ్వడంతో మరోసారి విరామం ఇవ్వాల్సి వచ్చింది. ఈ రెండు సందర్భాలు మినహా ఆదివారం సహా అన్ని రోజులూ యాత్ర కొనసాగుతోంది. పాదయాత్రలో లోకేశ్ సెల్ఫీ చాలెంజ్ పేరుతో ప్రభుత్వానికి సవాల్ విసురుతున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన పరిశ్రమలు, అభివృద్ధి కార్యక్రమాల వద్ద సెల్ఫీ దిగి.. ఇలాంటిది ఏదైనా వైసీపీ ప్రభుత్వం చేసుంటే చెప్పాలని చాలెంజ్ చేస్తున్నారు. అలాగే వైసీపీ హయాంలో మూసివేసిన అన్న క్యాంటీన్ భవనాలు, అమల్లోకి రానిదిశ చట్టం కింద ఏర్పాటైన పోలీస్ స్టేషన్లు, ఫిష్ ఆంధ్రా పాయింట్ల వద్ద కూడా సెల్ఫీలు దిగి పోస్టు చేస్తున్నారు. పాదయాత్రలో 'సెల్ఫీ విత్ లోకేశ్' కార్యకర్తలను ఆకట్టుకుంటోంది. రాత్రి బస చేసిన చోట ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. లోకేశ్‌తో సెల్ఫీ దిగాలని కోరుకునే కార్యకర్తలు, ప్రజలకు గంటపాటు సమయం కేటాయిస్తున్నారు. ఇందుకోసం కొత్త టెక్నాలజీని వాడుతున్నారు. లోకేశ్‌తో సెల్ఫీ దిగాక ఫేస్ రికగ్నేషన్ టెక్నాలజీ ద్వారా ఆ వ్యక్తి వాట్సప్ నెంబర్‌కు దానంతట అదే వెళ్లిపోతోంది. సగటున రోజుకు 1000-1500 మంది సెల్ఫీలు దిగుతున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## వాణిజ్య పన్నుల శాఖపై

# కేఆర్ సూర్యనారాయణ సంచలన ఆరోపణలు



అమరావతి: ప్రభుత్వం, వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారులపై వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణసంచలన ఆరోపణలు చేశారు. అవినీతి అధికారులను ప్రభుత్వం వెనకేసుకొస్తున్నట్టుగా కనిపిస్తోందని ఆరోపించారు. ఉన్నతాధికారులను ప్రశ్నిస్తున్న ఎస్సీ ఉద్యోగులను టార్గెట్ చేస్తున్నారంటూ విమర్శలు గుప్పించారు. సంబంధిత ఉన్నతాధికారులపై అట్రాసిటి కేసు పెడతామని కేఆర్ హెచ్చరించారు. బాధలు చెప్పుకుందామంటే మంత్రి బుగ్గన అందుబాటులో లేరంటూ సూర్యనారాయణ నిర్వేదం వ్యక్తం చేశారు. వాణిజ్య పన్నుల శాఖలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నియామకాలపై కేంద్రానికి కూడా ఫిర్యాదు చేస్తామంటూ కేఆర్ వార్నింగ్ ఇచ్చారు. "వాణిజ్య పన్నుల శాఖ విశాఖ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు బడ్జెట్ ఇవ్వలేదు. బడ్జెట్ లేకున్నా కార్పోరేట్ ఆఫీస్ హంగులతో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. బడ్జెట్ కేటాయింపులు లేకుండా ఏర్పాటు చేసిన ఆ కార్యాలయం ప్రారంభోత్సవానికి మంత్రి బుగ్గన, ఉన్నతాధికారులు వెళ్లారు. కార్యాలయం ఏర్పాటుకు వసూళ్లు చేశారంటూ ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఉన్నతాధికారి సుధాకర్ సహా ఐదుగురుపై ఆరోపణలు వచ్చాయి. కానీ కింది స్థాయిలో ఉన్న నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. ఏ-1గా ఉన్న విశాఖ వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ సుధాకర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు..? దొంగతనం చేసిన అధికారులను వదిలి ఉద్యోగులపై అకారణంగా చర్యలు తీసుకున్నారు. వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారులు తప్పు చేసిన వాళ్లను వెనకేసుకొస్తున్నారు. మంత్రి బుగ్గనకు చెబుదామంటే అందుబాటులో ఉండడం లేదు." అని కేఆర్ సూర్యనారాయణ చెప్పుకొచ్చారు. "మంత్రి బుగ్గన కార్యాలయంలో కూడా బాధ్యాయుతమైన వ్యక్తులు లేరు. వాణిజ్య పన్నుల శాఖ జోన్-1 పరిధిలోని బదిలీల్లో అవకతవకలు జరిగాయి. సీఎస్‌కు లేఖ రాసినందుకే సీనియర్ అసిస్టెంట్ రాజేశ్వరీని సస్పెండ్ చేశారు. ఎస్సీ వర్గానికి చెందిన సీనియర్ అసిస్టెంటును సస్పెండ్ చేయడం ఎస్సీ అట్రాసిటీ పరిధిలోకి వస్తుంది.చేసిన ఆ కార్యాలయం ప్రారంభోత్సవానికి మంత్రి బుగ్గన, ఉన్నతాధికారులు వెళ్లారు. కార్యాలయం ఏర్పాటుకు వసూళ్లు చేశారంటూ ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఉన్నతాధికారి సుధాకర్ సహా ఐదుగురుపై ఆరోపణలు వచ్చాయి. కానీ కింది స్థాయిలో ఉన్న నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. ఏ-1గా ఉన్న విశాఖ వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ సుధాకర్‌పై వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ నాగార్జునపై ఎస్సీ అట్రాసిటీ కేసు పెడతాం. గ్రూప్-1 అధికారి డి. రమేష్‌ను వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌గా నియమించారు. డి. రమేష్‌ను కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలి. లేకుంటే డీఓపీటీకి ఫిర్యాదు చేస్తాం. ఆకాశరామన్న ఉత్తరాలతో క్రమశిక్షణా చర్యలు తీసేసుకుంటున్నారు. ప్రభుత్వానికి.. మాకు వచ్చిన గ్యాప్‌ను ఆసరా చేసుకుని కొందరు అధికారులు వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సంఘాన్ని టార్గెట్ చేశారు. ఆదాయాన్ని పెంచేలా వాణిజ్య పన్నుల శాఖను పునర్ వ్యవస్థీకరించాలని సీఎం జగన్ సూచించారు. సీఎం జగన్ (%జవీ జీూ+ూచీ%) శాఖను పునర్ వ్యవస్థీకరించమంటే.. అధికారులు పునర్ విభజన చేస్తున్నారు. వికేంద్రీకరణ చేయమంటే.. కేంద్రీకృతం చేస్తున్నారు. రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధంగా బదిలీలు జరిగాయి. కాండక్ట్ రూల్స్ ప్రకారం ఉద్యోగుల ధర్నాలు చేయకూడదనేం లేదు. ప్రవర్తనా నియామవళికి లోబడే మేం ధర్నా చేపట్టాం. బదిలీల్లోని అక్రమాలపై చర్యలు తీసుకోమంటే.. మా సంఘంపై చర్యలు తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. తప్పు చేసిన అధికారులకు సన్మానం చేయాలా..? మేం ఎవరి విధులకు ఆటంకం కలిగించలేదు." అని కేఆర్ సూర్యనారాయణ వివరించారు.

# సర్కార్‌పై సమరమే!

## జత కట్టనున్న ఉద్యోగ సంఘాలు



విజయవాడ, : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల విషయంలో అనుసరిస్తున్న ధోరణిని కలిసి కట్టుగా ప్రశ్నించేందుకు ఉద్యమాన్ని తీవ్రతరం చేసే దిశగా ఏపీజేఏసీ అమరావతి అడుగులు ముందుకు వేసింది. ఉద్యోగ సంఘాలన్నింటినీ ఏకతాటి పైకి తెచ్చేందుకు విశాల వేదికను ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టింది. సహచర జేఏసీలతో కలిసి ఐక్య ఉద్యమాలు సాగించే దిశగా చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో ప్రధానమైన ఏపీజేఏసీని కూడా ఉద్యమ పథంలోకి తీసుకువచ్చి కలిసి పోరాటం చేయటానికి సిద్ధమైంది. ఈ నెల 28న ఏపీ రెవెన్యూ భవన్‌లో రౌండ్ టేబుల్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ సమావేశానికి ఏపీజేఏసీని ఆహ్వానించింది. ఏపీజేఏసీతో పాటు కార్మికవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ యూనియన్ల అగ్ర నాయకత్వంతో కూడా ఏపీజేఏసీ అమరావతి చర్చలు జరిపింది. ఇప్పటికే ప్రధానమైన సీపీఎస్ ఉద్యోగ సంఘాల మద్దతును కూడగట్టిన ఈ సంఘం ఈ నెల 25న కలెక్టరేట్ల ముట్టడికి పిలుపునిచ్చింది. ఏప్రిల్ 28న బెజవాడ వేదికగా జరిగే రౌండ్ టేబుల్ చాలా కీలకంగా మారనుంది. అదే రోజు ఉమ్మడి ఐక్యకార్యాచరణ ప్రకటించే అవకాశం ఉంది. గతంలో మాదిరిగా సమష్టిగా ఉద్యమం చేద్దామని ఏపీజేఏసీ అగ్రనాయకత్వానికి ఏపీజేఏసీ అమరావతి విజ్ఞప్తి చేసింది.ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావులతో కూడిన 15 మంది రాష్ట్ర కమిటీ ఏపీఎన్‌జీవో భవన్‌కు వచ్చి ఏపీజేఏసీ చైర్మన్ బండి శ్రీనివాసరావు, ఏపీఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేవీ శివారెడ్డిలను కలిసింది. ఉద్యోగుల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి సంబంధించి తాము ఉద్యమం చేస్తున్నామని, తొలిదశ పూర్తయిందని, రెండో దశ ఉద్యమం కొనసాగుతోందని బొప్పరాజు, దామోదరరావులు తెలిపారు. అందరం కలిసి ఏకతాటిపైకి వస్తే తప్ప ప్రభుత్వం స్పందించే పరిస్థితి లేదని చెప్పారు. గతంలో మాదిరిగా ఐక్యపోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉన్నందున తమతో కలిసి రావాలని బండి శ్రీనివాసరావు, శివారెడ్డిలను కోరారు. దీనికి బండి శ్రీనివాసరావు, శివారెడ్డిలు సానుకూలంగా స్పందించారు. సభ్య సంఘాలు, ఏపీఎన్‌జీవో సంఘం నాయకత్వాలతో సమావేశం ఏర్పాటు చేసుకుని తాము కూడా ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ నెల 28న రెవెన్యూ భవన్‌లో రౌండ్ టేబుల్ ఏర్పాటు చేశామని, ఈ కార్యక్రమానికి హాజరుకావాలని బొప్పరాజు విజ్ఞప్తి చేశారు. ఉద్యమాన్ని తీవ్రస్థాయికి తీసుకువెళ్లేందుకు సీఐటీయూ, ఏఐటీయూసీల భాగస్వామ్యాన్ని కూడా ఏపీజేఏసీ అమరావతి కోరింది.ఏపీజేఏసీ అమరావతి అగ్రనాయకత్వం విజయవాడలోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి సంఘం అగ్రనేతలను కలిసింది. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్. రవీంద్రనాథ్, ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నేతలతో బొప్పరాజు, దామోదరరావులు సమావేశమయ్యారు. ఆ తర్వాత సీఐటీయూ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు, అధ్యక్షులు ఏవీ నాగేశ్వరరావు, సీఐటీయూ అనుబంధ సంఘాల నేతలతో బొప్పరాజు, దామోదరరావులు భేటీ అయ్యారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల దుస్థితిని వివరించారు. రౌండ్ టేబుల్‌కు రావాలని కోరారు. దీనికి ఏఐటీయూసీ, సీఐటీయూ అగ్రనేతలు సైతం సానుకూలంగా స్పందించారు.

# రాజధాని అమరావతి విషయంలో ఎందుకంత హడావుడి?




అమరావతి : రాజధాని అమరావతి విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వేసిన ఎస్ఎల్‌పీ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉండగా.. హడావుడిగా రాజధాని మాస్టర్ ప్లాన్‌ను సవరించి ఆర్-5 జోన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏముందని హైకోర్టు ప్రశ్నించింది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలప్రజలకు రాజధాని ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇచ్చే నిమిత్తం గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లకు 1,134 ఎకరాలు బదలాయించేందుకు సీఆర్డీఏ కమిషనర్‌కు అనుమతిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాల విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. భూబదలాయింపు, ఇళ్లస్థలాల కేటాయింపును నిలువరించాలని రైతులు బెజవాడ రమేశ్‌బాబు, ఆలూరి రాజేశ్, యు.శివయ్య, కట్టెపోగు రాజేశ్, కుర్రా బ్రహ్మం, కట్టా రాజేంద్రవరప్రసాద్ వేసిన అనుబంధ పిటిషన్లపై ఇరుపక్షాల వాదనలు ముగియడంతో ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్.జయసూర్యతో కూడిన ధర్మాసనం ఆదేశాలిచ్చింది. రైతుల తరఫున సీనియర్ న్యాయమూర్తులు దేవదత్ కామత్, వీఎసఆర్ ఆంజేయులు, న్యాయవాదులు జోతిరత్న అనుమోలు, సంజయ్ సూరనేని, కారుమంచి ఇంద్రనీల్‌బాబు వాదనలు వినిపించారు. పేదల ఇళ్లకోసం ఐదు శాతం భూమిని ఇవ్వడాన్ని తాము వ్యతిరేకరించడం లేదన్నారు. రెసిడెన్షియల్ జోన్‌లో సీఆర్‌డీఏ వద్ద 2 వేల ఎకరాల ల్యాండ్‌బ్యాంకు ఉందన్నారు. అక్కడ ఆర్థికంగా వెనుకబడిన వారికి ఇళు నిర్మించి ఇస్తే అభ్యంతరం లేదని తెలిపారు. మాస్టర్ ప్లాన్‌లో భాగమైన ఎలక్ట్రానిక్ సిటీ, నాన్ పొల్యూటెడ్ ఇండస్ట్రియల్ జోన్లలో ఇళ్ల స్థలాలు ఇవ్వడాన్నే తాము వ్యతిరేకరిస్తున్నామన్నారు. ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం పూర్తి సమాచారాన్ని కోర్టు ముందు ఉంచడం లేదని.. సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పీపై తేలేవరకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై స్టే విధించాలని అభ్యర్థించారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, సీఆర్‌డీఏ తరఫున న్యాయవాది కాసా జగన్మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఏఏజీ మహాభారతాన్ని ప్రస్తావిస్తూ.. ఆ రోజు పాండవులు ఐదూళ్లు అడిగారని.. ఇప్పుడు తాము చట్టప్రకారం ఆర్థికంగా వెనుకబడిన తరగతుల ఇళ్ల నిర్మాణం కోసం 5 శాతం భూమి ఇవ్వాలని మాత్రమే కోరుతున్నామని తెలిపారు. తమ ముఖ్యమంత్రి శ్రీకృష్ణుడివంటివారని కీర్తించారు. ధర్మాసనం స్పందిస్తూ.. ఆ రోజు కృష్ణుడికి అన్నీ తెలిసి కూడా కురుక్షేత్ర యుద్ధాన్ని ఆపలేదని వ్యాఖ్యానించింది. ఇప్పుడు కూడా సీఆర్‌డీఏ, రైతుల మధ్య ఏం జరుగుతుందో తెలిసి చూస్తూ ఊరుకుంటున్నారని పేర్కొంది. హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామని.. అందులో భాగంగానే ఇళ్లస్థలాలు ఇస్తున్నామని ఏఏజీ అన్నారు. ధర్మాసనం జోక్యం చేసుకుని.. 'హైకోర్టులో న్యాయవాదులకు కనీస సదుపాయాలు లేవని గుర్తు చేసింది. వారికి బార్ రూమ్, అడ్వకేట్ జనరల్ (ఏజీ) కార్యాలయం, కార్లు పెట్టుకోవడానికి పార్కింగ్ షెడ్ వంటివి కూడా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాటి గురించి ఎందుకు పట్టించుకోవడం లేదు? న్యాయవాదుల్లో కేవలం 5శాతం మంది మాత్రమే ఆర్థికంగా ఉన్నతస్థానంలో ఉన్నారు. మిగిలిన 95శాతం ఆర్థికంగా వెనుకబడినవారే. వారికి సదుపాయాలు కల్పించే విషయాన్ని కూడా ఆలోచించాలి' అని సూచించింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఇంకా చాలా సమస్యలు పరిష్కారం కాలేదని, లక్ష కోట్ల రూపాయాలు విలువ చేసే ఆస్తులు పక్క రాష్ట్రంలో ఉండిపోయాయని కాసా జగన్మోహన్‌రెడ్డి వివరించగా.. అందుకేనా ప్రతి హైదరాబాద్ వెళ్తున్నారని ధర్మాసనం ప్రశ్నించింది. ప్రభుత్వం వేసిన ఎస్ఎల్‌పీ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉండగా.. హడావుడిగా ఇళ్లస్థలాలు కేటాయింపు నిమిత్తం భూమిని కలెక్టర్లకు బదలాయించాల్సిన అవసరం ఏముందని ఏఏజీని అడిగింది. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. రైతులతో చేసుకున్న ఒప్పందానికి అనుగుణంగా రాజధాని ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు నవనగరాలను అభివృద్ధి చేసి రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వాల్సిన చట్టబద్ధమైన బాధ్యత సీఆర్‌డీఏపై ఉందని రైతుల తరఫు న్యాయవాదులు అంతకుముందు స్పష్టం చేశారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు ఇళ్లస్థలాల కేటాయింపు గురించి మాస్టర్ ప్లాన్‌లో ప్రస్తావించలేదని ఏఏజీ తెలిపారు.

## ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించకుంటే సేవలు బంద్

అమరావతి: "నెట్‌వర్క్ ఆస్పత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించ డంతో పాటు ఈ నెలాఖరులోగా బిల్లులు విడుదల చేయాలి. లేకుంటే ఆరో గ్య శ్రీ కింద వైద్య సేవలు చేయలేం" అని ఆంధ్రప్రదేశ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్ హెచ్చరించింది. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో ఎంఎన్ హరీంద్రప్రసాద్‌కు ఈ మేరకు లేఖ రాసింది. నెట్‌వర్క్ ఆస్పత్రులన్నీ తీవ్రమైన ఆర్థిక ఒత్తిడితో కొట్టుమిట్టాడుతున్నాయని, చివరికి డాక్టర్లకు, ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితికి వచ్చాయని ఆవేదన వ్యక్తం చేసింది. కొంతకాలంగా ఆరోగ్యశ్రీ ట్రస్ట్ నెట్‌వర్క్ ఆస్పత్రులకు పూర్తిస్థాయి లో బిల్లులు చెల్లించడం లేదు. కోట్ల రూపాయలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో అసోసియేషన్.. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోకు ఘాటు లేఖ రాసింది. 2022 జూలై తర్వాత ఉద్యోగుల హెల్త్ స్కీమ్‌కు సంబంధించిన బిల్లులు చెల్లించలేదని పేర్కొంది. ఆగస్టు 2022 తర్వాత ఆరోగ్యశ్రీ బిల్లులు విడుదల చేయలేదని తెలిపింది. కాగా అసోసియేషన్ లేఖ రాసిన విషయాన్ని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కొట్టిపారేసింది. తమకు ఎవరూ ఎలాంటి నోటీసులూ ఇవ్వలేదని, ఈ ప్రచారంలో నిజం లేదని పేర్కొంది.

## ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి : వ్యకాస



ఆదోని:వేసవిలో పని ప్రదేశాల్లో ఉపాధి కూలీలకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని వ్యకాస మండల అధ్యక్ష, కార్యదర్శులు జి.రంగనాథ్, డి.రా మాంజనేయులు డిమాండ్ చేశారు. వారు ఉపాధి కూలీలతో మాట్లాడా రు. ఎర్రని ఎండల్లో సైతం పనిచేస్తున్న ఉపాధి కూలీలకు తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టానికి అనేక సవరణలు చేస్తూ తూట్లు పొడిచేందుకు తీసుకొస్తునాయని తెలిపారు. ప్రజలను ఉపాధి చట్టం నుంచి దూరం చేసే కుట్రలు పన్నుతున్నాయని విమర్శించారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 వేతనం, 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలు అయ్యన్న, హనుమంతు, లక్ష్మమ్మ, రంగమ్మ పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం

మంత్రాలయం:ప్రజా సంక్షేమం, అభివృద్ధి అజెండాగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని వైసిపి యువజన విభాగం రాష్ట్ర నాయకులు వై.ప్రదీప్ రెడ్డి తెలిపారు. మండలంలోని చిలకలడోణ గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగనన్నదేనని తెలిపారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు గురించి లబ్ధిదారులతో అడిగి తెలుసుకున్నారు. 'గడపగడపకు మన ప్రభుత్వం'లో భాగంగా ఆయన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, ఇన్‌ఛార్జి విశ్వనాథ్ రెడ్డి, సొసైటీ ఛైర్మన్ వెంకట్ రెడ్డి, సిఇఒ వెంకటేష్, సర్పంచి నాగమ్మ, ఎంపిటిసి ఆకుల లక్ష్మి పాల్గొన్నారు.

## తెలుగుగంగ స్థిరీకరణకు కసరత్తు

కడప ప్రతినిధి : తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన బ్రహ్మసాగర్ స్థిరీకరణ కసరత్తు జోరందుకుంది. తెలుగుగంగ ఇంజినీరింగ్ యంత్రాంగం పెం డింగ్ పనులపై దృష్టి సారించింది. కుడి, ఎడమ కాల్వల్లోని పెండింగ్ పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా ఎంచుకుంది. ఆర్నెళ్ల కింద కుడి, ఎడమ కాల్వల్లో పెం డింగ్ పనులకు రూ.28 కోట్లతో టెండర్లు పిలిచింది. రూ. 6.3 కోట్లను భూ సేకరణకు కేటాయించింది. ప్రధానంగా ఎడమ కాల్వలో భాగమైన పోరు మామిళ్ల–బద్వేల్ కాల్వ పనులు పరుగులు పెడు తుండడం ఆశలు రేపుతోంది. జిబిసి, ఒబిసి కాల్వల పెండింగ్ పనులు దశాబ్దాలుగా



వేధిస్తున్న సంగతి తెలిసి ందే. మొదటగా కుడి, ఎడమ కాల్వల్లోని పెండింగ్ పనుల బిట్లను గుర్తించింది. పెండింగ్ పనుల బిట్లను పూర్తి చేయడమే లక్ష్యంగా సాగుతోంది. జిబిసి, ఒబిసి కెనాల్ పనుల్ని సకాలంలో పూర్తి చేయగలిగితే 30 వేల ఎకరాలు ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉంది. ఫలితంగా తెలుగుగంగ రిజర్వాయర్ కింద పూర్తి స్థాయిలో సాగు నీటిని అందించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జిబిసి కింద 20 వేల ఎకరాలు, ఒబిసి కింద 10 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు నోచు కునే అవకాశం ఉ ంది.బ్రహ్మసాగర్ రిజర్వాయర్ కింద సాగులో ఉన్న 96,500 ఎకరాల ఆయకట్టుకు అదనంగా కలవనున్న 30 వేల ఎకరాల ఆయకట్టు కారణంగా 1.30 లక్షల ఎకరాలకు సాగు నీటిని అందించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బ్రహ్మసాగర్ రిజర్వాయర్ పరిధిలోని 1.58 లక్షల ఆయకట్టు లక్ష్యాన్ని సుమారుగా అందుకునే దిశగా కదులుతోంది. 2024 డిసెంబర్ నాటికి బ్రహ్మసాగర్ రిజర్వాయర్ కాల్వల పెండింగ్ పనుల్ని పూర్తి చేయడమే లక్ష్యంగా కదులుతున్న నేపథ్యంలో ఆయకట్టు రైతాంగంలో ఆసక్తి నెలకొంది.

## ఉద్యోగులపై ఒత్తిడి తగదు : సిపిఎం




కడప : చెత్తపన్ను చెల్లించకపోతే ఇంటి పన్నుతో కలిపి వసూలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులపై ఒత్తిడి చేయడం తగదని సిపిఎం కడప నగర కార్యదర్శి ఎ. రామమోహన్ తీవ్రంగా విమర్శించారు.సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది చెత్త పన్ను వసూలు చేయక పోతే వేతనాల్లో కోత విధిస్తామని ప్రభుత్వం చెప్పడం దుర్మార్గమన్నారు. సచివాలయ సిబ్బంది వేతనాలకు చెత్త పన్ను వసూళ్లకు ముడిపెట్టడం అన్యాయమన్నారు. నగర ప్రజానీకాన్ని బెదిరించి, భయ సిబ్బంది జీతాల్లో కోత పెట్టారని పేర్కొన్నారు. నగర పాలక సంస్థ వసూలు చేస్తున్న చెత్త పన్నుపై కౌన్సిల్ సమావేశంలో ప్రతి ఇంటి నుంచి రూ.40, రూ.60 వసూలు చేయాలని తీర్మానం చేసిందన్నారు.

# సంరక్షణలో నిర్లక్ష్యం.. తగలబడుతున్న అరణ్యం



కదిరి, : జాతీయ సంపద అయిన అటవీ సంరక్షణలో అధికారుల్లో చిత్తశుద్ధి లోపిస్తోంది. నిరంతర పర్యవేక్షణ, స్వచ్ఛంద కార్యకర్తలు, ఫైర్‌వాచర్లు, అడవులకు నిప్పు పెట్టకూడదనే చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నా ఫలితంలేదు. ఆయా చర్యల్లో నిర్లక్ష్యం ఫలితంగా అటవీ విస్తీర్ణత తగ్గుతోందనే విమర్శలున్నాయి. ఏటా మానవ తప్పిదాలతో వేసవికి మొదలకు ముందే అడవులు కాలిపోతున్నాయి. ఓవైపు అడవుల అభివృద్ధికి మొక్కలు నాటి సంరక్షణకు ఏటా రూ.కోట్లు ఖర్చు పెడుతున్నారు. మరోవైపు ఆకతాయిల, పొలంగట్లు కాల్చటంతో నిప్పుపడి సహజంగా పెరిగే వృక్షాలూ కాలుతున్నాయి. ఏటా వేసవి మొదలైదంటే చాలు అగ్నికీలలకు పచ్చనివృక్షాలు ఆహుతి అవుతున్నాయి. పచ్చదనం పరుచుకుని దట్టంగా విస్తరించాల్సిన అడవులు, బూడిదగా మారి బోడిగుట్టలుగా దర్శనమిస్తున్నాయి. దీనంతటికీ సంబంధిత అధికారుల అలసత్వం, విధులపై నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో కళ్లముందే అటవీ సంపద బుగ్గిపాలవుతోంది. అడవులకు నిప్పు ఆకతాయిల వల్ల కొంతైతే.. పశువుల కాపరులు, పొలం గట్లపై కలుపుమొక్కల నివారణ కారణవుతోంది. అటవీ అధికారులు జాగ్రత్తలు పాటిస్తున్నామంటున్నా క్షేత్రస్థాయిలో కనిపించటంలేదు. అరుదైన వృక్షజాతులు, ఔషధ మొక్కలు కాలి బూడిదవుతున్నాయి. అడవులకు నిప్పుతో సమీపంలోని రైతుల పండ్లతోటలు కాలుతున్నాయి. అధికారుల్లో నిర్లక్ష్యం ఆవహించిందనటానికి సంఘటనలు చోటుచేసుకున్న ప్రాంతాల్లో ఎక్కడా చర్యలు కనిపించకపోవటమే నిదర్శనం. ఇప్పటికే బుక్కపట్నం రేంజ్‌లో అడవి 44వేల హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో ఉంది. ఇప్పటికే చెంద్రాయనిపల్లి, బుచ్చయ్యగారిపల్లి, కొత్తకోట, జానకంపల్లి, బుక్కపట్నం ప్రాంతాల్లో నిప్పుపడి అడవి కాలి బూడిదైంది. కదిరి రేంజ్‌లో ఉన్న 50 వేల హెక్టార్ల పైచిలుకు అడవీప్రాంతంలో నిగ్గిడి, బత్రేపల్లి, ఈశ్వరమల తదితర ప్రాంతాల్లో అగ్నికీలలకు ఆహుతైంది. ఇలా ఇప్పటికే చాలా ప్రాంతాల్లో సగానికి పైగా అటవీ ప్రాంతంలోని పచ్చదనం కాలిపోవటంతో బోడిగుట్టలుగా మారుతున్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో 33 శాతం ఉ ండాల్సిన అటవీ విస్తీర్ణం కేవలం 13.95 శాతమే ఉంది. అటవీ విస్తరణకు ఏటా వర్షా కాలంలో మొక్కలు నాటడం, వేసవిలో అగ్నికి ఆహుతి కావటం పరిపాటిగా మారింది. దీంతో పచ్చదనం హరించిపోతోంది. మొక్కల పెంపకటంతో పాటు నాటిమొక్కలు, సహజ అడవులను కాపాడు కోవటానికి పలు రకాల కార్యక్రమాలను చేపడుతున్నారు. అడవి అగ్నికి గురికాకుండా టీపీటీలు, కందకాలు తవ్వకంతోపాటు కాలిబాటలను 2017–19 వరకు చేపట్టారు. తర్వాత అలాంటి చర్యలు లేవు.

# పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకోండి



గాలివీడు, : వెలిగల్లు ప్రాజెక్టు వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం ఉ ంద ని, ఇక్కడ పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ పీఎస్ గిరీషా ఆదేశించారు. గాలివీడు మండలంలోని వెలిగల్లు ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ సందర్శించి ప్రాజెక్టు సామర్థ్యం, వాటర్ నిల్వ ఎంత ? చెరువులకు ఎన్ని క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రాయచోటి మున్సిపా లిటీకి ఎంత వాటర్ డ్రా చేస్తున్నారు వంటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అందులో భాగంగా ప్రాజెక్టులో నీటి సామర్థ్యం పరిశీలించి బోటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వెలిగల్లు ప్రాజెక్టు వద్ద టూరిజంను ఏ విధంగా అభివృద్ధి చేయవచ్చు వంటి వాటిని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాజెక్టు పైభాగంలో ఉన్న కొండపై గెస్ట్‌హౌస్ ఏర్పా టు చేస్తే ప్రాజెక్టు వ్యూ, స్పిల్‌వే, రివర్ మొత్తం బాగా కనపడుతుందని, ఇక్కడ మంచి వాతావరణం ఉందన్నారు. టూరిజం ప్రాజెక్టు వద్ద అడ్వెంచర్ స్పోర్ట్స్ వం టి అభివృద్ధి పనులు తదితర వాటిపై ఆ శాఖ అధికారులను కలెక్టర్ అడిగి తెలు సుకున్నారు. గెస్ట్‌హౌస్ సమీపంలోనే ఐదు నుంచి పది కాటేజీలు ఏర్పాటు చేసేం దుకు చర్యలు తీసుకోవాలన్నారు. అందులో భాగంగా ప్రాజెక్టు వద్ద పార్కును కలెక్టర్ సందర్శించి పార్కు చాలా బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే కుషావతి నదిలో చెత్తను వేయకుండా చూడాలని, ఒకవేళ వేస్తే రూ.10 వేలు జరిమానా వేసేలా బోర్డు పెట్టాలని పంచాయతీ కార్యదర్శి సురేష్‌కుమార్‌ను ఆదే శించారు. అనంతరం ప్రాజెక్టు వద్ద గండిమడుగులో వెలిసిన ఉ మామహేశ్వర స్వామి దేవస్థానంలో కలెక్టర్ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ జిల్లా అధికారి కృష్ణమూర్తి, జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగభూషణం, ఇరి గేషన్ ఈఈ వెంకటరామయ్య, డీఈఈలు వెంకటేశ్వరరావు, జనార్ధన్, తహసీల్దార్ దైవాధీనం, ఎంపీడీవో శేఖర్‌నాయక్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. జగనన్న లేఅవుట్ కాలనీల్లో అన్ని శాఖలు సమన్వయంగా పనిచేసి మౌలిక వసతులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ పీఎస్ గిరీషా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుంచి జగనన్న హౌసింగ్ లేఅవుట్ కాలనీల్లో గృహ నిర్మాణాల ప్రగతిపై హౌసిం గ్, విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, డ్వామా, ఎంపీడీవోలు, మండల ఇంజనీరింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి గృహ నిర్మాణాల పూర్తికి చేపట్టాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల తాను కొన్ని హౌసింగ్ లేఅవుట్లను స్వయంగా సందర్శించినప్పుడు తన దృష్టికి కొన్ని సమస్యలు వచ్చాయన్నారు. ఇందులో ముఖ్యంగా ప్రభుత్వ శాఖల ద్వారా సమన్వయం కొరవడినట్లు తెలుస్తోందన్నారు. పేదవారికి ఒక గూడు కల్పించాలనే సదుద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతి ష్టాత్మకంగా చేపట్టిన జగనన్న లేఅవుట్ కాలనీల్లో వందశాతం మౌలిక వసతులు కల్పించడం అధికారుల బాధ్యతన్నారు. లక్ష్య సాధనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. హౌసింగ్, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్, పంచాయతీరాజ్, డ్వామా తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నాలుగేళ్లుగా రాని షెడ్డు బిల్లులు



సంబేపల్లె, ఏప్రిల్ 21 : వ్యవసాయ అనుబంధ శాఖల్లో పట్టుగూళ్ల పెంపకం ఒకటి. అయితే ఈ పట్టు సాగు ప్రస్తుతం సన్నగిల్లుతోందని చెప్పవచ్చు. వ్యవసాయ పంటలు సాగు చేసి సరైన దిగుబడులు రాక నష్టాల్లో ఉన్న రైతులు మల్బరీ సాగువైపు ఆసక్తి చూపారు. తీరా చూస్తే నాలుగేళ్లుగా షెడ్డు బిల్లులు రాక, రెండేళ్లుగా ప్రో త్సాహక డబ్బులు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు షెడ్లు కూడా నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వంలో 2018లో పట్టుగూళ్ల పెం పకం కోసం షెడ్లు మంజూరు చేశారు. ఒక్కో షెడ్డు రూ. 9.50 లక్షలతో నిర్మాణాలు చేపట్టేందుకు రైతులు సిద్ధమ య్యారు. నాలుగేళ్లు పూర్తవుతున్నా షెడ్ల బిల్లులు మా త్రం రాలేదు. ఉపాధి హామీ పథకం కింద రావాల్సిన డ బ్బులు మాత్రం వచ్చాయి. తద్వారా పట్టు సాగు సన్నగిల్లుతుందని చెప్పవచ్చు. సాధారణంగా పట్టుగూళ్ల పెంపకంతో 45 రోజులకు ఒకసారి దిగుబడి తీసి ఆదాయాన్ని పొందవచ్చు. అన్నమయ్య జిల్లాలో 11,052 ఎకరాల్లో మల్బరీ సాగు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కేవలం సంబేపల్లె మండలంలో 220 ఎకరాల్లో సాగులో ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో 8413 మంది రైతులు మల్బరీ సాగుచేసినట్లు అధికారులు తెలిపారు. ఒక్కో రైతు 100 నుంచి 150 కేజీల పట్టు గూళ్లను మార్కెట్‌కు తరలించి తర్వాత రైతుకు ప్రోత్సాహకం కింద కేజీకి రూ.50 లెక్కన అందిస్తారు. ఈ లెక్క ప్రకారం 100 కేజీలకు రూ.5 వేలు ప్రభుత్వం అందించాలి. ఇది రైతుల ప్రోత్సాహం కింద అదనంగా ఇచ్చే డబ్బులు. కానీ రెండేళ్లుగా ప్రోత్సాహక డబ్బులు రైతులకు రావడం లేదన్నారు. మల్బరీ సాగుపై మంచి ఆదాయం వస్తుంది. రెండు ఎకరాల సాగుకు 37,500 సబ్సిడీ ఇస్తున్నాం. టైప్ వన్ షెడ్డు 50 పొడవు 20 వెడల్పు (3లక్షల సబ్సిడీ), టైప్ 2 షెడ్డుకు 30 పొడవు 20 వెడల్పు (2.50 లక్షల సబ్సిడీ) అందిస్తున్నట్లు తెలిపారు. బీసీ, ఓసీ రైతులకు 75 శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. రైతులకు మార్కెటింగ్ కూడా అందుబాటులో ఉన్నట్లు తెలియజేశారు. మదనపల్లె, హిందూపురం, అనంతపురం, కదిరి, ధర్మవరం ప్రాంతాల్లో పట్టుగూళ్లు కొనుగోలు చేస్తున్నట్లు తెలియజేశారు. నేను 2018లో పట్టుగూళ్ల పెంపకం సాగు చేశాను. మా మామ వెంకటరెడ్డి పేరుతో షెడ్డూ మంజూరైం ది. ఆయనతో పాటు విజయ్ కుమార్‌రెడ్డి అనే మరో రైతుకు కూడా అధికారులు షెడ్డు మంజూరు చేశారు. కానీ ఇప్పటికి నాలుగేళ్లు పూర్తవుతున్నా బిల్లులు రాకపోవడంతో ప్లాంటేషన్‌ను దున్నేశా. దీనికి తోడు ప్రోత్సాహక నగదు కూడా రెండేళ్లుగా ఇవ్వలేదు. ఇలా ఉంటే ఈ పంటపై ఆసక్తి చూపేదెలా.

## వ్యాధి నిరోధక టీకాలను సక్రమంగా వినియోగించండి




అనంతపురం : వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా వినియోగించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి ఏం శ్రీనివాసులు పేర్కొన్నారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆరోగ్య సంస్థ ప్రతినిధి ఆకస్మికంగా తనిఖీ చేశారు.రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని మూలగిరి పల్లి,రాకెట్ల తండా గ్రామాలలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించాల్సిన విధి విధానాలపై అవగాహన కల్పించారు.వ్యాక్సిన్లు సరైన ఉష్ణోగ్రతల వద్ద నిల్వ చేస్తున్నారా రికార్డులు సరిగా నిర్వహిస్తున్నారా అనే విషయాలపై ఆరా తీశారు.చిన్న చిన్న లోపాలు ఉంటే వాటిని సరిదిద్దుకోవాలని సూచించారు.అనంతరం ఆర్సిహెచ్,వీవీయం రిజిస్టర్లను తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో నాగ హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎంఎస్ షఫీ,హెల్త్ సూపర్వైజర్ శ్రీధర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ల్యాప్టాప్‌లు, టచ్ స్క్రీన్ ఫోన్‌లు స్వాధీనం



మంత్రాలయం:బిల్లులు లేని 9 ల్యాప్టాప్‌లను సెల్‌ఫోన్‌లకు సంబంధించిన 660 టచ్ స్క్రీన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు మాధవరం ఎస్ఐ కిరణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఆదివారం ఉదయం 10:00 గంటల సమయంలో దిబ్బన దొడ్డి గ్రామ పరిధిలోని కురువ వీరా రెడ్డి మిరప పొలంలో తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైకి చెందిన ఇబ్రహీం షాహిద్ ఇమామ్, ముంబై రాష్ట్రానికి చెందిన మొహమ్మద్ ఫరాజ్, జావిద్ అన్సారి అను ముగ్గురు వ్యక్తులు బాక్సులను తరలిస్తుండగా సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించామని చెప్పారు. ఈ సందర్భంగా ఎలాంటి బిల్లులు లేకుండా హెచ్పీ కంపెనీకి చెందిన తొమ్మిది లాప్టాప్ లను మరియు సెల్ఫోన్లకు సంబంధించిన టచ్ స్క్రీన్ లను 66 బాక్స్ లు ( ఒక్కొక్క బాక్స్ లో 10 చొప్పున మొత్తం 660 టచ్ స్క్రీన్లు) తీసుకొని పోతుండగా పట్టుకొన్నామని పేర్కొన్నారు. ఏలాంటి బిల్స్ లేని కారణంగా తదుపరి చర్యల నిమిత్తం ఆదోని సేల్స్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ వారికి అప్పగించటం జరిగిందని తెలిపారు.

## రహదారి కష్టాలు తీరేదెన్నడు?



కళ్యాణదుర్గం:కళ్యాణదుర్గం మండలం కొండాపురం నుంచి మానిరేవుకు వెళ్లే మూడు కిలోమీటర్ల మేర రహదారి గత వరదల్లో కోతకు గురై, రాళ్లు తేలి అధ్వానంగా మారింది. దీంతో ప్రజలు 20 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వస్తోంది. కొండాపురం గ్రామంలో 500 కుటుంబాలు ఉండగా 1,500 మంది జనాభా నివాసం ఉంటున్నారు. ఇక్కడి ప్రజలకు సచివాలయం మానిరేవులో ఉంది. పనుల నిమిత్తం అక్కడికి వెళ్లాలంటే మూడు కిలోమీటర్ల మేర మట్టిదారిలో రాకపోకలు సాగించేవారు. మూడేళ్ల కిందట భారీ వర్షాల కారణంగా మట్టిరోడ్డు కోతకు గురై, కంకర తేలింది. మార్గమధ్యలో ఉన్న వంకలో ప్రస్తుతం పెన్నా నది ప్రవహిస్తోంది. దీంతో అటువైపు వెళ్లలేని పరిస్థితి. కొండాపురం వాసులు వెంకటంపల్లి, హనిమిరెడ్డిపల్లి, కాలువపల్లి, ఓబుళాపురం మీదుగా 20 కిలోమీటర్లు ప్రయాణించి మానిరేవు చేరుకుంటున్నారు. మట్టిరోడ్డును బాగు చేయాలని గ్రామస్థులు పలుమార్లు మంత్రి, ఎంపీల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. భారీ వర్షాల కారణంగా మట్టిరోడ్డు కోతకు గురై, కంకర తేలింది. మార్గమధ్యలో ఉన్న వంకలో ప్రస్తుతం పెన్నా నది ప్రవహిస్తోంది. దీంతో అటువైపు వెళ్లలేని పరిస్థితి. కొండాపురం వాసులు వెంకటంపల్లి, హనిమిరెడ్డిపల్లి, కాలువపల్లి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మూడుకిలోమీటర్ల రోడ్డు బాగు చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ జేఈ కిశోర్‌ను వివరణ కోరగా రహదారి నిర్మాణానికి ఇది వరకే ప్రతిపాదనలు పంపాం. నిధులు విడుదలైతే పనులు పూర్తి చేసి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామన్నారు.

# టమోటాకు గిట్టుబాటు ధర కల్పించాలి

రామసముద్రం,: టమోటా పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ప్రచార భేరి జీపుజాతా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వారు రామసముద్రం చేరుకుని మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని, రైతు వ్యతిరేక చట్టాలను తీసు కొచ్చి దేశంలో వ్యవసాయాన్ని పూర్తిగా కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యపట్టారు. రైతు పొలాల్లోనే రైతులను కూలీలుగా మార్చే దుర్మార్గమైన చట్టాలను తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మదనపల్లెలో అతిపెద్ద టమోటా మార్కెట్ ఉన్నప్పటికీ అక్కడ దళారి చేతుల్లో రైతు నిలువునా మోసపోయే పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ కృష్ణప్ప, సాంబశివ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్ర, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కే.మురళి, మండల నాయకులు సూరి, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు. నిమ్మనపల్లెలో: ప్రజా వ్యతిరేక నిరంకుశ బీజేపీని పారదోలి దేశాన్ని కాపాడుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ప్రచార బేరి వాహనంలో నిమ్మనపల్లె అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వ దుర్మా ర్గాల ను నిలదీయాలన్నారు. అలాగే మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న ద్రోహాన్ని ప్రజలకు తెలపాలన్నారు. పోలవరం రైల్వేజోన రాజధాని రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రజలకు ఇవ్వాల్సిన ప్యాకేజీలను ఇవ్వకుండా ద్రోహం జేసిందన్నారు. ఈ నెల 14నుంచి 30వరకు జరిగే ప్రజార బేరిలో ప్రజలంతా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఐ నాయకులు మహేష్, క్రిష్ణప్ప, సీపీఎం నాయకులు రామచంద్ర తదితరులు పాల్గొన్నారు. వాల్మీకిపురంలో: కేంద్రంలోని బీజేపీని రానున్న ఎన్నికల్లో ఇంటికి సాగనంపడానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు కలిసి రావాలని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు నరసింహులు, శ్రీని వాసులు పిలుపునిచ్చా రు. నిరంకుశ బీజేపీని సాగనంపుదాం దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో శుక్రవారం సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో




వాల్మీకిపురంలో ప్రచార జీపు జాతా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. దళితుల ముస్లిం మైనార్టీలకు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో వెనుకబడ్డ జిల్లాల అభివృద్ధికి కేటాయిస్తామన్న నిధులు ఏమ య్యాయని ప్రశ్నించారు.

# రూ.కోట్ల స్థలంపై ఓ రాజకీయపార్టీ కన్ను!

అనంతపురం : రూ.కోట్ల విలువైన హెచ్చెల్సీ స్థలాన్ని కొందరు ఆక్రమించుకుం టున్నారు. అయినా.. ఇదేమని అడిగే నాథుడే లేదు. ఈక్రమంలోనే ఆ స్థలంపై ఇటీవల అధికార పార్టీ నాయకుల కన్ను పడింది. ఎలాగైనా సరే లీజు పేరుతో ఎకరన్నర స్థలం నొక్కేసేందుకు ఓ రాజకీయపార్టీ అధికారులపై తీవ్ర ఒత్తిడి పెంచింది. నగరం నడిబొడ్డున జలవనరుల శాఖ హెచ్చెల్సీకి సంబంధించి సుమారు 22ఎకరాల స్థలం ఉంది. ఇది రూ.కోట్ల విలువ చేస్తుంది. దాన్ని పరిరక్షించుకోవాల్సిన అధికారులు మిన్నకుండిపోతున్నారు. మొదట 37 ఎకరాలు ఉన్న స్థలాన్ని ప్రస్తుతం 26ఎకరాలకే పరిమితం చేశారు. అందులో కూడా ప్రస్తుతం 22ఎకరాలు మాత్రమే మిగిలింది. ఇందులో 3ఎకరాలు ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించగా మిగిలిన 19ఎకరాలు మాత్రమే జలవనరుల శాఖలోని హెచ్చెల్సీ ఆధీనంలో ఉంది. హెచ్చెల్సీ క్వార్టర్స్‌కు సంబంధించిన స్థలాన్ని ఇప్పటికే పలు కార్యాలయా లకు కేటాయించారు. ఇందులో త్రీటౌన పోలీసస్టేషన, దిశ పోలీసస్టేషన, మైనింగ్ ఆఫీస్, అగ్రికల్చర్ జేడీ ఆఫీస్, హంద్రీనీవా ఆఫీసలకు, ఓ కోర్టుకు సుమారు 3ఎకరాలకుపైగా కేటాయించారు. కొంత స్థలంలో ప్రార్థనా మందిరాలు వెలిశాయి. అంతేగాక ఓ కల్యాణమండపం, ట్రస్టు ఏర్పాటు చేసి లైబ్రరీ ఓపెన చేస్తామని చెప్పారు. ఓ ఫంక్షనహాల్ నిర్మించడంపై వివాదం రేగింది. ఇలా కోట్లాది రూపాయలు విలువ చేసే స్థలంపై అందరి కన్ను పడింది. ఈక్రమంలో అవకాశం వచ్చిన ప్రతిసారీ స్థలాన్ని ఆక్రమించేస్తున్నారు. 37ఎకరాల స్థలాన్ని ఆక్రమణలు, కేటాయింపులకు పోగా 19 ఎకరాలకు మిగిల్చారు. హెచ్చెల్సీ స్థలంలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నా అడిగేనాథుడే లేదు.



అయితే అక్రమ నిర్మాణాలు, అద్దె భవనాలకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. దీంతో బకాయి ఉన్న అద్దె మొ త్తాన్ని చెల్లించారు. అయితే ఇప్పటి వరకు ఉన్న లీజులు రద్దు చేస్తామని, తిరిగి రెన్యువల్ చేసుకోవడానికి వీలు లేదని, స్థలం మొత్తం జలవనరుల శాఖకు అప్పగించాలని సూచించినట్లు సమాచారం. దీనిపై కూడా అధికారపార్టీ నేతలు ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం.
విలువైన హెచ్చెల్సీ ఎకరన్నర స్థలంలో అధికారపార్టీ జిల్లా కార్యాలయాన్ని నిర్మించుకోవడానికి యత్నిస్తోంది. 33ఏళ్ల పాటు ఎకరన్నర స్థలాన్ని లీజుకు ఇవ్వాలని జలవనరుల శాఖ అధికారులపై తీవ్ర ఒత్తిడి చేస్తోంది. ఇప్పటికే ఆ పార్టీ ఇచ్చిన లేఖ జలవనరుల శాఖలో తీవ్ర దుమారం రేపుతోంది. మెజార్టీ అధికారులు స్థలాన్ని లీజుకు ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు. అయితే జలవనరుల శాఖలో ఉన్నత స్థాయిలో ఉన్న అధికారులు లోలోపల గుట్టుగా సహకరిస్తున్నారనే అనుమానాలు ఆశాఖలో కలుగుతున్నాయి.

# బీజేపీని అడ్డుకోవడంలో కాంగ్రెస్ విఫలం

ఖమ్మం : బీజేపీని అడ్డుకోవడంలో కాంగ్రెస్ విఫలమయ్యాయని, అందుకే దేశానికి మతోన్మాదముప్పు ఏర్పడిందని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విమర్శించారు. సీపీఐ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన సీపీఐ ప్రజాపోరు యాత్ర ఖమ్మం చేరుకోగా మంత్రి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎసకు కమ్యూనిస్టులు రెండు కళ్లు లాంటివని, జాతీయస్థాయిలో విపక్షాలు ఐక్యంగా లేకపోవటంతోనే బీజేపీ కేంద్రంలో అధికారంలోకి రాగలిగిందని, బీజేపీతో ఉన్న ముప్పును గుర్తించిన టీఆర్ఎస్... బీఆర్ఎసగా మారిందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన తమ్మినేని, కూనంనేని సీపీఎం,సీపీఐ రాష్ట్ర కార్యద ర్శులుగా పనిచేయడం ప్రస్తుత సమయంలో సమాజానికి మంచి పరిణామమన్నారు. బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ ఉమ్మడిగా బీజేపీని ఎదుర్కొంటామని.. ఉమ్మడి ఖమ్మంలో పదికి పది సీట్లు గెలిచి తీరుతామన్నారు. ఎనిమిది రాష్ట్రాల్లో బీజేపీ దొడ్డిదారిన ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి అధికారంలోకి వచ్చిందని, బండి సంజయ్ బండ బూతులు తిడుతూ రాజకీయాలు చేస్తున్నారని ఆయనకు గుండు పగిలేలా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. జనధన ఖాతాలో రూ.15లక్షలు వేస్తామని ప్రకటించిన మోదీ కనీసం 15పైసలు కూడా వేయలేదని ఎద్దేవాచేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీపీఎం,సీపీఐలకు కలిపి ప్రతీ నియోజకవర్గంలో 20వేల నుంచి 25వేల ఓట్లున్నాయని, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పైసా ఖర్చు పెట్టకుండా కొత్తగూడెం, ఖమ్మం, పాలేరులో పోటీ చేస్తే కమ్యూనిస్టుల సత్తా చూపిస్తామని సవాల్ విసిరారు. ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే సహించబోమన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే మతాలకు అతీతంగా ఇఫ్తార్ విందులు చేసేందుకు అనుమతి ఉండదన్నారు. రూ.400 కోట్లు ఖర్చు పెట్టి రాష్ట్ర ప్రభుత్వం సచివాలయం నిర్మాణం చేస్తే అది మసీదు రూపంలో ఉందని, అధికారంలోకి వస్తే కూలగొడతామని బండి సంజయ్ అంటున్నారని మండిపడ్డారు.



సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు మాట్లాడుతూ ప్రజాపోరుయాత్రలో 80మంది పాల్గొన్నారని ఇప్పటి వరకు 8మంది వడదెబ్బకు గురైనారని, ఎంతటి ఎండ తీవ్రతనైనా తట్టుకొని మతోన్మాదంపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సీపీఐ నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఏపూరి లతాదేవి, మేకల శ్రీనివాసరావు, కొండపర్తి గోవిందరావు, వెంకటనారాయణ, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, జానిమియా, కళావతి, తదితరులు పాల్గొన్నారు. కొత్తగూడెం టౌన్: సీపీఐ ప్రజాపోరుయాత్ర భద్రాద్రి జిల్లాలో ముగిసింది. ఈ సందర్భంగా కొత్తగూడెం సూపర్‌బజారుసెంటరులో జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ కమ్యూనిస్టులు అనేక పోరాటాలు చేసి సాధించిన కార్మికచట్టాలను కాలరాసేలా వ్యవహరిస్తు న్న బీజేపీని తరిమికొట్టేందుకు అన్నివర్గాల ప్రజలు సిద్ధమవ్వాలన్నా రు. నిత్యావసర ధరలను అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, కేంద్రంలోని బీజేపీని గద్దెదించేందుకే బీఆర్‌ఎసతో స్నేహం చేస్తున్నామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్‌పాషా మాట్లాడుతూ గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌ప్రజలకు ఇచ్చినహామీలను అమ లుచేయాలని డిమాండ్ చేశారు. సభలో పార్టీ రాష్ట్రకార్యవర్గసభ్యు డు బొల్లోజు అయోధ్య నాయకులు బందెల నర్సయ్య, శ్రీనివాసరెడ్డి, కె.వెం కటేశ్వరరావు,లక్ష్మికుమారి, ప్రసాద్, వెంకటేశ్వర్లు,శ్రీనివాస్ పాల్గొన్నారు.

## గుర్రంగడ్డ బ్రిడ్జి నిర్మాణంలో

# జాప్యంపై అసహనం

గద్వాల : 'గుర్రంగడ్డ ప్రజల అవస్థలను, బాధలను అర్థం చేసుకొని, ముఖ్యమంత్రి గద్వాల కు వచ్చినప్పుడు బ్రిడ్జి మంజూరు చేయించాను. నాలుగేళ్లు గడిచినా పనులు నత్తనడకన సాగుతున్నాయి' అని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించేందుకు గుర్రంగడ్డకు వెళ్తూ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం బ్రిడ్జిని మంజూరు చేయించానని, వెంటనే జీవో విడుదల కావడంతో పాటు టెండ ర్లు కూడా పూర్తయ్యాయని తెలిపారు. కానీ ఇప్పటికీ పిల్లర్ల నిర్మాణమే కొనసాగుతోందని విమర్శించారు. కాంట్రాక్టర్ నిర్ల క్ష్యంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులను పూర్తి చేయించా లని అధికారులను ఆదేశించారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గుర్రంగడ్డలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఇప్పటి వరకు గ్రామ సర్పంచు బాలక్రిష్ణారెడ్డి రూ.80లక్షల సీసీ రోడ్లు, మట్టి పనులతో పాటు ఇతర అభివృద్ధి పనులు చేశాడని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, సర్పం చు బాలక్రిష్ణారెడ్డి, మండల పార్టీ మాజీ అధ్యక్షులు రమేష్ నాయుడు, నాయకులు నీలేశ్వర్‌రెడ్డి, బీచుపల్లి, జగన్‌రెడ్డి, శ్రీరాములు, శ్రీను ఉన్నారు. పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ గొప్ప



వరమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం గద్వాల మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 44 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరక్టర్ సుభాన్, ఎంపీపీ ప్రతాప్‌గౌడు, ఎంపీటీసీ సభ్యుడు శంకర్, తహసీల్దార్ వెంకటేశ్, ఆర్ఐ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. మైనారిటీలకు అన్ని విధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తన సొంత ఖర్చుతో 1,500 పేద మైనార్టీలకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఆయన కుమారుడు సాయిసాకేత్‌రెడ్డి చేతుల మీదుగా రంజాన్ తోఫాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, పీఏసీఎస్ డైరెక్టర్ సుభాన్, ఎంపీపీ ప్రతాప్‌గౌడు, వైస్ చైర్మన్ బాబర్ పాల్గొన్నారు.

# నిబంధనల ప్రకారమే రిజిస్ట్రేషన్ చేయాలి

నారాయణపేట : ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. నారాయణపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ వివరాలు, ప్రక్రియ, రికార్డు గదులు, స్టాంప్‌ల నిల్వలు తదితర విషయాలను సబ్ రిజిస్ట్రార్‌ను అడిగి తెలుసు కున్నారు. ఆస్తుల విక్రయాలు, రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన లింక్ పత్రాలు తప్పక పరిశీలించాలని, ఆస్తులు కొనుగోలు, అమ్మకం దారులకు ఇబ్బందులు లేకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన ఇసుక రీచ్‌ల ద్వారా మధ్య తరగతి ప్రజలకు ఇసుకను తక్కువ ధరకు అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని కలెక్టర్ శ్రీహర్ష పేర్కొన్నారు. సామాన్యులకు ఇసుకను అందుబాటులోకి తీసుకొచ్చేందుకే మన ఇసుక వాహనం పేరుతో టీఎస్‌ఎం.సీజీజీ.జీఓవీ.ఇన్/హెూం అందుబాటులో ఉందన్నారు. ఇసుక అవసరమున్న వారు సదరు వెబ్‌సైట్ ద్వారా ఇసుకను బుక్ చేసుకోవాలని కలెక్టర్ కోరారు. బ్యాంకు లింకేజీ, రుణాల వసూళ్లు సకాలంలో లక్ష్యాలకు అనుగుణంగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారులు, సిబ్బందితో బ్యాంకు లింకేజీ, రుణాల వసూళ్లు, యూనిట్ల గ్రౌండింగ్ తదితర అంశాలపై సమీక్షించి, మాట్లాడారు. నిర్ణీత ప్రకారం వీవోల సమావేశాలు నిర్వహించాలని, రికార్డులు రాయాలని, ప్రతీ సంఘం ఏ గ్రేడ్‌లో ఉండాలని, సంఘాలకు మంజూరు చేసిన రుణాలను వందశాతం రికవరీ చేయాలని



ఆదేశించారు. ఒక్కశాతం మించి ఎన్‌పీఏలు ఉండకుండా సమీక్షించుకోవాలని, డీఆర్డీవో పర్యవేక్షణ ఉండాలని, పీఎం ఎఫ్ఎంఈ గ్రౌండింగ్‌లో సిబ్బంది బాధ్యతతో పని చేయాలని, నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే కొనాలని, అధికారులు పర్యవేక్షించాలని, టార్పాలిన్లు, తూకం మిషన్లు తదితర వాటిని సమకూర్చుకోవాలన్నారు. ధాన్యం అమ్మిన రోజే రైతు విరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఏపీఎం క్షేత్ర పర్యటన చేయాలన్నారు. డీఆర్డీవో పీడీ గోపాల్‌నాయక్, అదనపు డీఆర్డీవో అంజయ్య, డీపీఎంలు పాల్గొన్నారు.
జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ద్వారా విద్యార్థినులకు ఇండియన్ స్ట్రగల్ ఫర్ ఇండిపెండెన్స్ పుస్తకాలను గురువారం కలెక్టర్ శ్రీహర్ష కలెక్టరేట్‌లో పంపిణీ చేశారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అదికారి కృష్ణమాచారి, విద్యార్థినులు పాల్గొన్నారు.

# నగదు ప్రోత్సాహకమేదీ?



అలంపూర్ చౌరస్తా, : ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేసీఆర్ కిట్ పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకంలో భాగంగా గర్భం దాల్చినప్పటి నుంచి విడతలవారీగా మొదటి వైద్య పరీక్షలు చేయించుకున్నప్పుడు రూ.3 వేలు, అయిదు నెలలు నిండిన తర్వాత ఏఎన్‌సీ చెకప్ పూర్తయ్యాక మరో రూ.3వేలు, ఆ తర్వాత కాన్పులో అమ్మాయి పుడితే రూ.5వేలు, అబ్బాయి పుడితే రూ.4వేలు నాలుగో విడత నగదు కాన్పు తర్వాత బిడ్డ సంరక్షణ కోసం రూ.2 వేలు ఇలా రెండు కాన్పులకు అమ్మాయి అయితే రూ.13 వేలు, అబ్బాయి అయితే రూ. 12వేలు అందజేయ నున్నారు. ఈ నగదుతో పాటు కేసీఆర్ కిట్ కూడా అందిస్తున్నారు. ప్రసవ సమయంలో ఇచ్చే కిట్ ఎంతో ఉపయోగకరమైనది. ఇందులో దుస్తులు, బేబీ సబ్బులు, అయిల్, పౌడర్, దోమతెర, బొమ్మలు, న్యాప్‌కిన్‌లు, డైపర్ మొదలగు వస్తువులతో కూడిన బ్యాగును తల్లికి అందజేస్తారు. 2017, జూన్‌లో మొదలైన ఈ పథకం రెండేళ్లపాటు సాఫీగా కొనసాగింది. ఆ తర్వాత లబ్ధిదారులకిచ్చే కేసీఆర్ కిట్టు మాత్రమే అందుతోంది. కానీ నగదు అందడంలేదు. జోగుళాంబ గద్వాల జిల్లాలో రెండేళ్లలో మొత్తం 13,318 మంది కేసీఆర్ కిట్ పథకానికి అర్హులుగా గుర్తించారు. ఇందులో కేవలం ఇప్పటిదాక 471 మందికి మాత్రమే నగదు ప్రోత్సహకాలు అందాయి. మిగతా 12,847 మందికి నగదు అందకపోవడంతో వారు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. సుమారు రూ. 15.24 కోట్ల నిధులు జిల్లాకు రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

# డిజిటల్ బోధనకు రంగం సిద్ధం

నారాయణపేట, : ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'మన ఊరు – మన బడి' పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతోంది. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తూ ఆధునిక సాంకేతికతను జోడిస్తుంది. ఈ క్రమంలో వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డిజిటల్ టచ్ స్క్రీన్ టీవీల ద్వారా విద్యార్థులకు బోధన అందించేందుకు విద్యాశాఖ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో ఎంపిక చేసిన 49 పాఠశాలలకు 147 డిజిటల్ టీవీలు, బోర్డులు వచ్చాయి. 2023–24 విద్యా సంవత్సరం జూన్ ఆరంభంలో డిజిటల్ బోధనను ప్రారంభించి, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు డిజిటల్ బోధన అందించేలా చూస్తున్నారు. గ్రీన్ బోర్డ్‌ను ఏర్పాటు చేసి మధ్యలో 75 ఇంచుల టచ్ స్క్రీన్ అమరుస్తారు. గ్రీన్ బోర్డు ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి యూ ట్యూబ్, యాప్‌ల ద్వారా పాఠాలు బోధించేందుకు ఇంటర్నెట్ ద్వారా స్క్రీన్‌పై డిజిటల్ బోధన చేసేలా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా వ్యాప్తంగా వచ్చే విద్యా సంవత్సరం మొదటి విడతగా 49 ఉన్నత పాఠశాలల్లో 8,9,10 తరగతులకు 147 డిజిటల్ టచ్ స్క్రీన్ టీవీల ద్వారా విద్యా బోధన అందించేందుకు చర్యలు చేపట్టాం. ఇప్పటికే గ్రీన్ బోర్డులు, టీవీల ఏర్పాటు చేశాం. ఉపాధ్యాయులకు త్వరలోనే డిజిటల్ బోధనపై పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తాం. విద్యార్థులకు సులవుగా పాఠ్యాంశాలు అర్థమయ్యేలా డిజిటల్ క్లాసులు ఎంతో ఉపయోగపడుతాయి. కలెక్టర్ సహకారంతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను డిజిటల్ పాఠశాలలుగా మారుస్తాం.

## హరితహారం మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలి

పెద్దపల్లి: హరితహా రంలో భాగంగా మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సంగీత సత్య నారాయణ సంబంధిత అధికారులను సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. నెలలో హరి తహారం కార్యక్రమం జరుగుతుందని, మొక్కలు నాటేందకు సరైన ప్రాంతాల ను ఎంపిక చేయలన్నారు. కాలువలు, ప్రాజెక్టులకింద భూసేకరణ చేసిన భూమిలో నాట్లు వేయకు ండా అవగాహన కల్పించాలన్నారు. ఖరీఫ్ సీజన్లో ప్రభు త్వం సేకరించిన భూముల్లో రైతులు నాట్లు వేసినట్లయితే మండల వ్యవసాయ అధికారులపై కఠిన చర్యలు తీసకుంటా మన్నారు. ఓటరు జాబితాలో తొలగించిన ఓటర్ల వివరాలను మనోసారి ధ్రువీకరిం చాలని తహసీ ల్దార్లను ఆదేశించారు. జిల్లాలో ఫొటో సిమిలర్ ఎంట్రీల్లో మొత్తం 593 మంది ఓటర్ల పూర్తి రికార్డులు తొలగిపోయాయని, 1644 మంది వివరాలు అసలు పోలేదని, తహసీల్దార్లు సదరు రికార్డులను మరోసారి పరిశీలించి అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు కుమార్ దీపక్, లక్ష్మీనారాయణ, డీఆర్‌డీవో శ్రీధర్, ఇరిగేషన్ అధికారి శ్రీనివాస్, ప్రసాద్, ప్రవీన్ తదితరులున్నారు.



# ప్రారంభం కానున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు

భూపాలపల్లి: యాసంగి (వేసవి) పంట కోతలు ప్రారంభమయ్యాయి. ధాన్యం కొనుగోలుకు అధికారులు సిద్ధమవుతున్నారు. గత వేసవి సాగును పోల్చుకుంటే ఈసారి వరి విస్తీర్ణం రెండింతలు పెరిగింది. దీంతో అదే స్థాయిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ఖరీఫ్‌లో ఏర్పాటు చేసిన 213 కొనుగోలు కేంద్రాలకే మళ్లీ అనుమతులు ఇవ్వ నున్నారు. ఈ యాసంగిలో రైతులు 82 వేల ఎకరాల్లో వరి పంట సాగుచేయగా 1.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలును అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. గత యాసంగిలో వరి సాగుచేస్తే ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయదని సీఎం కేసీఆర్ ప్రకటిం చడంతో జిల్లా రైతులు ఆ పంటపై ఆసక్తి చూపలేదు. జిల్లా వ్యాప్తంగా 40 వేల ఎకరాలలోపు మాత్రమే వరి ని పండించారు. తర్వాత ప్రభుత్వం దిగొచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేసింది. ఈ క్రమంలో రైతులు ఈసారి పెద్దమొత్తంలో వరిని సాగు చేశారు. అధికారుల లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 82వేల ఎకరాల్లో వరి సాగు అయ్యింది. ఇందులో కొంత మేర సీడ్ రకం వరి పంట ఉండగా మిగిలిన పంటను రైతులు కొనుగో లు కేంద్రాలకు తరలించనున్నారు. జిల్లాలో ముందుగా కాటారం, మొగుళ్లపల్లి మండలాల్లో వరి కోతలు ప్రారంభమవుతుండటంతో ఈనెలలోనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతుల నుంచి ధాన్యం కొనుగో లు చేసేందుకు అధికారులు సిద్ధవుతున్నారు. యాసంగి సీజన్‌లో జిల్లాలో రైతులు సూమారు 82 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేసిన నేపథ్యంలో సుమారు 1.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుం దనేది అధికారుల అంచనా. అందుకు అనుగుణంగానే పౌరసరఫరాల శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. కొనుగో లు కేంద్రాల్లో గన్నీ సంచులు, టార్పాలీన్లు, ప్యాడీ క్లీనర్లతోపాటు ఎలక్ట్రానిక్ వెయింగ్ మిషన్లను సిద్ధం చేస్తున్నారు. 1.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లకు అవసరమయ్యే 30 లక్షల గన్నీ సంచులను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. దీం తోపాటు అకాల వర్షాల తో కొనుగోలు కేంద్రా ల్లో వరి ధాన్యం తడవకుండా ఎని మిది వేల టార్పా లీన్లను కేంద్రాల్లో అందుబాటులో ఉంచనున్నారు. ప్రస్తుతానికి రెండు వేల టార్పాలీన్లు అందుబాటులో ఉండగా మరో ఆరు వేలను అధికా రులు కొనుగోలు చేయనున్నారు. ప్రతి గ్రామంలోనూ కొనుగోలు కేంద్రా లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నుంచి నిర్దిష్టమైన ఆదేశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అదే స్థాయిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఖరీఫ్‌లో ఏర్పాటు చేసిన 213 కేంద్రా లనే యాసంగిలో వినియోగించనున్నారు. ఈ కొనుగో లు కేంద్రాలను ఈనెలలోనే ప్రారంభించేందుకు అధి కారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో యాసంగిలో సాగుచేసిన వరి పంటను కొనుగోలు కేంద్రాలు తక్కువగా ఉండటంతో వానాకాలం మొదటి వరకు సెంటర్ల నిర్వాహకులు కొంటూనే ఉండేవారు. కానీ అకాల వర్షాల వల్ల రైతుల ధాన్యానికి నష్టం జరుగుతుం టంతో ఎక్కువ సంఖ్యలో కేంద్రాలను ఏర్పాటుచేయడం ద్వారా పంటను త్వరగా కొనుగోలు చేసే అవకాశం ఉంది. మండలంలో యాసంగి వరి కోతలు ప్రారంభమ య్యాయి. గురువారం పలువురు రైతులు తమ పొలాలను హార్వెస్టర్ల సాయంతో కోయించారు. మండలంలోని రేగులగూడెం, దేవరాంపల్లి, భూడిదపల్లి, గొల్లపల్లి, శంకరంపల్లి, గోపాలపురం, చల్లపల్లి, గంగారం, తదితర



గ్రామాల్లో యాసంగి వరి పొలాలు కోతలకు సిద్ధంగా ఉన్నాయి. బోరుబావుల కింద సాగుచేసిన యాసంగి వరి పొలాలు కోతకు వచ్చాయి. రైతులు స్వల్ప, మధ్యకాలిక రకాలైన ఎంటీయూ1010, బతుకమ్మ (జేజీఎల్18047), కూనారం118, తరంగిణి (1156) వంటి వంగడాలను సాగు చేశారు. అకాల వర్షాలు నష్టం కలిగిస్తాయని ఆందోళన చెందుతున్న రైతులు పొలాలను త్వరగా కోయించి విక్రయించాలని చూస్తున్నారు. రైతులు ధాన్యాన్ని ప్రతిపాదిత కొనుగోలు కేంద్రాల వద్ద కుప్పలుగా పోస్తున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల(పీపీసీ)లను త్వరగా ఏర్పాటు చేయాలని కోరు తున్నారు. జిల్లాలో 1.30 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ మేరకే అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాట్లు చేయబోతున్నాం. జిల్లాలో 213 కొనుగోలు కేంద్రాలను త్వరలోనే ప్రారంభిస్తాం. పంట కోతలు ప్రారంభమయ్యే నాటికి కొనుగోలు కేంద్రాలు సిద్ధవుతాయి.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**